بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

సంపుటి: 11
www.akhbarbadr.in
సంచిక: 32

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

یٰۤاَیُّہَا الَّذِیۡنَ اٰمَنُوا اتَّقُوا اللّٰہَ وَلۡتَنۡظُرۡ نَفۡسٌ مَّا قَدَّمَتۡ لِغَدٍ ۚ وَاتَّقُوا اللّٰہَ ؕ اِنَّ اللّٰہَ خَبِیۡرٌۢ بِمَا تَعۡمَلُوۡنَ ۔ وَلَا تَکُوۡنُوۡا کَالَّذِیۡنَ نَسُوا اللّٰہَ فَاَنۡسٰہُمۡ اَنۡفُسَہُمۡ ؕ اُولٰٓئِکَ ہُمُ الۡفٰسِقُوۡنَ ۔

అనువాదం: " ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడుడు. ప్రతి ప్రాణి రేపటి కొరకు ముందు పంపునదేమని దృష్టియందుంచుకొనవలెను. అల్లాహ్‌కు భయపడుడు. నిశ్చయముగా మీరు చేయునదంతయు అల్లాహ్ బాగుగా ఎరుగును ం అల్లాహ్‌ను విస్మరించిన వారివలే కాకుడు. అప్పుడు అల్లాహ్ స్వయముగా వారితో వారిని విస్మరింపజేసెను. వీరే నేర చరితులు. (హషర్: 19-20)

తేది: 06 ఆగష్టు 2026 క్రీ, శ. 06జహూర్ 1405 హి, శ. 22 సఫర్ 1448 హి,ఖ.

## మానవుడు ఈ ప్రాపంచిక కోరికలను మరియు భౌతిక సు:ఖాలనే స్వర్గంగా భావిస్తాడు. వాస్తవానికి అవే నరకం వంటివి.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు: " ఇస్లాంలో పరమార్థమైన జీవితాన్ని పొందుటకు ఒక మరణాన్ని కోరుకుంటుంది. ఇది చేదు నిజం. అయితే ఆ మరణాన్ని స్వీకరించేవాడే చివరికి నిజమైన జీవితాన్ని పొందుతాడు. హదీస్‌లో ఇలా గలదు: మానవుడు ఈ ప్రాపంచిక కోరికలను మరియు భౌతిక సు:ఖాలనే స్వర్గంగా భావిస్తాడు. వాస్తవానికి అవే నరకం వంటివి. కానీ అదృష్టవంతుడైన మానవుడు అల్లాహ్ మార్గంలో ఎదురయ్యే కష్టాలను స్వీకరిస్తాడు, అదే నిజమైన స్వర్గం అవుతుంది. ఈ ప్రపంచం నాశనమవుతుంది. ఇందులో ఎటువంటి సందేహం లేదు. ప్రతి ఒక్కరూ మరణించడానికి పుట్టించబడ్డారు. చివరకు ఒక సమయం వస్తుంది. అప్పుడు స్నేహితులు, పరిచయస్తులు, బంధువులు, ఆప్తులు అందరూ విడిపోతారు. ఆ సమయంలో మానవుడు అన్యాయమైన సుఖాలు మరియు భోగాలను ఎంత ఆనందంగా భావించాడో, అవే బాధలు మరియు చేదు అనుభవాల రూపంలో ప్రత్యక్షమవుతాయి. నిజమైన శ్రేయస్సు మరియు ప్రశాంతత తక్వా (దైవభక్తి) లేకుండా లభించవు. తక్వాపై స్థిరంగా ఉండటం అనేది విషపు గిన్నె తాగినంత కష్టమైనదిగా అనిపించవచ్చు. కానీ తక్వా కలిగిన వ్యక్తికి అల్లాహ్ అన్ని రకాల సౌఖ్యాల సాధనాలను సమకూర్చుతాడు. **మన్ య్యత్తఖిల్లాహ యజ్అల్ ల్లహు మఖ్రజన్ వ యర్జుఖ్హు మిన్ హైసూ లా యహ్తసిబు** (అత్తలాఖ్ :3-4) అనగా "ఎవరైతే అల్లాహ్‌కు భయపడుతూ జీవిస్తారో, వారికి అల్లాహ్ ఒక మార్గాన్ని కల్పిస్తాడు మరియు అతను ఊహించని చోటు నుండి మానవునికి జీవనోపాధిని ప్రసాదిస్తాడు." అందువల్ల నిజమైన సంతోషకరమైన జీవనానికి మూల సూత్రం తక్వానే. అయితే తక్వాను పొందడానికి మనం షరతులు పెట్టుకుంటూ తిరగకూడదు. తక్వాను స్వీకరిస్తే, నీవు కోరినది లభిస్తుంది. అల్లాహ్ అత్యంత దయామయుడు, కరుణామయుడు. తక్వాను అవలంబించండి, మీరు కోరినదాన్ని అల్లాహ్ ప్రసాదిస్తాడు." **(మల్ఫూజాత్, సంపుటి 3, పుట 90, 2003 ఎడిషన్, రబ్వా ప్రచురణ)**

## 'తత్తకూన్' అనే పదానికి మరో అర్థం ఏమిటంటే, మీరు మీ ప్రభువును నిష్కపటతతో, దృఢ విశ్వాసంతో ఆరాధించినట్లయితే, పరస్పరం ఒకరు మరొకరికి చేసే అన్యాయాల నుండి కూడా రక్షించ బడతారు.

హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు సూరహ్ బఖరాలోని 22వ సూక్తి యొక్క తఫ్సీర్‌ను వివరిస్తూ ఇలా పేర్కొన్నారు:

"'తత్తకూన్' అనే పదానికి ఒకవైపు అల్లాహ్ తఆలా మరియు ఆయన దాసుని మధ్యనున్న సంబంధాన్ని చెడగొట్టే విషయాల నుండి దూరంగా ఉండటం అనే అర్థం ఉన్నట్లే, మరోవైపు మనుషుల పరస్పర సంబంధాలను దెబ్బతీసే విషయాల నుండి కూడా దూరంగా ఉండాలని సూచిస్తుంది. అల్లాహ్ ఆరాధన మనిషిని ఇటువంటి తప్పిదాల నుండి కూడా రక్షిస్తుంది. ఎవరైనా అల్లాహ్ తఆలాను తన ప్రభువుగా (రబ్‌గా) భావిస్తారో, వారు అల్లాహ్ ప్రాణులతో కూడా మంచి సంబంధాలను ఏర్పరచుకోవడం తప్పనిసరి అవుతుంది. అలాగే, అతడు ఇతరులపై అన్యాయం చేయడు. ఎందుకంటే తనను అల్లాహ్ యొక్క నిజమైన దాసునిగా భావించే వ్యక్తి తన అవసరాలన్నింటికీ అల్లాహ్‌పైనే ఆధారపడతాడు. ముఖ్యంగా అల్లాహ్ తన 'రబ్' అని అతనికి దృఢమైన విశ్వాసం ఉన్నప్పుడు. అల్లాహ్ తన అవసరాలన్నింటినీ తీర్చేవాడని విశ్వసించే వ్యక్తి ఇతరుల సంపదపై ఆశ పెట్టుకోడు. తన అవసరాలను తీర్చుకోవడానికి వారి ఆస్తిలో ద్రోహం చేయడు, మోసం చేయడు, వారిపై అన్యాయం కూడా చేయడు. కాబట్టి 'తత్తకూన్' అనే పదానికి మరో అర్థం ఏమిటంటే, మీరు మీ ప్రభువును నిష్కపటతతో, దృఢ విశ్వాసంతో ఆరాధించినట్లయితే, పరస్పరం ఒకరు మరొకరికి చేసే అన్యాయాల నుండి కూడా రక్షించ బడతారు. ఫలితంగా ఈ లోకంలో కూడా శాంతి స్థాపించ బడుతుంది. సహాబా కిరామ్ తమ ప్రభువుకు నిజమైన దాసులుగా మారారు. చూడండి! వారి పరిపాలనలో ప్రపంచం ఎంతటి శాంతి యుతముగా కొనసాగింది. వారి శత్రువులు సైతం వారి సత్ప్రవర్తనను అంగీకరించారు. నేటికీ హజ్రత్ అబూబకర్ (రజి) మరియు హజ్రత్ ఉమర్ (రజి)ల పాలన ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచివుంది. హజ్రత్ ఉస్మాన్ (రజి) మరియు హజ్రత్ అలీ (రజి)ల పాలన కూడా అలాంటిదే. అయితే వారి గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నందున ఇక్కడ నేను ప్రత్యేకంగా ప్రస్తావించలేదు." ( తఫ్సీరే కబీర్, సంపుటి 1, పుట 302 -ఆన్‌లైన్ ఎడిషన్)

## ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

حضعَنۡ أَبِي هُرَيْرَةَ ، قَالَ: قَالَ رَسُولُ اللَّهِ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ: "لَا تَحَاسَدُوا، وَلَا تَنَاجَشُوا، وَلَا تَبَاغَضُوا، وَلَا تَدَابَرُوا، وَلَا يَبِعْ بَعْضُكُمْ عَلَى بَيْعِ بَعْضٍ، وَكُونُوا عِبَادَ اللَّهِ إِخْوَانًا الْمُسْلِمُ أَخُو الْمُسْلِمِ لَا يَظْلِمُهُ، وَلَا يَخْذُلُهُ، وَلَا يَحْقِرُهُ التَّقْوَى هَاهُنَا، وَيُشِيرُ إِلَى صَدْرِهِ ثَلَاثَ مَرَّاتٍ، بِحَسْبِ امْرِئٍ مِنَ الشَّرِّ أَنْ يَحْقِرَ أَخَاهُ الْمُسْلِمَ كُلُّ الْمُسْلِمِ عَلَى الْمُسْلِمِ، حَرَامٌ دَمُهُ، وَمَالُهُ، وَعِرْضُهُ ". (صحیح مسلم کتاب البروالصلةوالآداب باب تحریم ظلم المسلم وخذله....حدیث:٦٥٤١)

అనువాదం: హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఉల్లేఖిస్తున్నారు: ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా చెప్పారు: "మీరు ఒకరిపై ఒకరు అసూయ పడకండి. పరస్పరం గొడవ పడకండి. ఒకరి పట్ల మరొకరు ద్వేషం పెట్టుకోకండి మరియు శత్రుత్వం పెంచుకోకండి. మీలో ఎవరూ మరొకరి వ్యాపార ఒప్పందంపై తన వ్యాపార ఒప్పందాన్ని చేయకండి. ఓ అల్లాహ్ సేవకులారా! మీరు పరస్పరం సోదరులుగా మారండి. ఒక ముస్లిం మరొక ముస్లింకు సోదరుడు. అతడు తన సోదరుడిపై అన్యాయం చేయడు, అతడిని అవమానించడు మరియు అతడిని తక్కువగా చూడడు.ఆ తర్వాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన హృదయం వైపు మూడు సార్లు చూపిస్తూ ఇలా అన్నారు: 'తక్వా (దైవభీతి) ఇక్కడ ఉంది, తక్వా ఇక్కడ ఉంది, తక్వా ఇక్కడ ఉంది.' ఒక వ్యక్తి "తన ముస్లిం సోదరుడిని తక్కువగా భావించడమే" అతడి చెడు ప్రవర్తనకు నిదర్శనం. ప్రతి ముస్లింకు మరొక ముస్లిం యొక్క రక్తం, సంపద మరియు గౌరవం అపవిత్రమైనవి (హరామ్).

### (అహ్మదియ్యా వార్తలు)

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్యవంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).***

اَللّٰھُمَّ اَیِّدۡ اِمَامَنَا بِرُوۡحِ الۡقُدُسِ
وَبَارِکۡ لَنَا فِیۡ عُمُرِہٖ وَاَمۡرِہٖ ۔

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا اِلٰهَ اِلَّا اللّٰهُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰهِ

# జీవితపు ముఖ్యోద్దేశం దైవభీతిని సాధించడం

**2019 లండన్ జల్సా సాలానా ప్రారంభ సమావేశంలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా గారి ప్రారంభ ప్రసంగ సారాంశం:**

● **ఎలాగైతే రాత్రి మరియు పగలు ఒకేసారి కలిసివుండలేవో, అలాగే విశ్వాసం మరియు పాపం కూడా కలిసి ఉండలేవు.**

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా గారు 2019 ఆగస్టు 2, శుక్రవారం తేదిన, యూకే అహ్మదీయా జమాత్ వార్షిక జల్సా (జల్సా సాలానా) ప్రారంభ సమావేశంలో ఎంతో జ్ఞానవంతమైన, ఆధ్యాత్మిక సందేశంతో కూడిన ప్రసంగం చేశారు.

హుజూర్ గారు అహ్మదీయత్ జెండాను ఎగురవేసిన అనంతరం దుఆ చేయించారు. సాయంత్రం 4:37 గంటలకు సభా ప్రాంగణానికి విచ్చేసి అధ్యక్ష స్థానంపై ఆసీనులైనారు. అనంతరం కార్యక్రమంను అధికారికంగా ప్రారంభించారు.

సమావేశం పవిత్ర ఖుర్ఆన్ పారాయణంతో ప్రారంభమైంది. ముకర్రమ్ రాషిద్ ఖత్తాబ్ సాహిబ్ (కబాబీర్) సూరా ఆల్ ఇమ్రాన్ లోని 191 నుండి 196వ సూక్తులను పారాయణం చేశారు. అనంతరం వాటి ఉర్దూ అనువాదాన్ని మౌలానా నసీర్ అహ్మద్ కమర్ సాహిబ్ (అదనపు వకీల్ అల్-ఇషాఅత్, లండన్) వినిపించారు.

తర్వాత, హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) వారి పర్షియన్ పద్యం నుండి కొన్ని పంక్తులను ముకర్రమ్ సయ్యద్ ఆశిక్ హుసైన్ సాహిబ్, అలాగే వారి ఉర్దూ పద్యం నుండి కొన్ని పంక్తులను ముకర్రమ్ ముసవ్విర్ అహ్మద్ సాహిబ్ (ఆస్ట్రియా) మధుర స్వరంతో ఆలపించారు.

సాయంత్రం 5:04 గంటలకు, హుజూర్ గారు వేదికపైకి విచ్చేసి, జల్సాలో పాల్గొన్న వారందరికీ, అలాగే ఎం.టి.ఎ. ద్వారా ప్రపంచవ్యాప్తంగా వీక్షిస్తున్న, వింటున్న అందరికీ "అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహి వ బరకాతుహు" అని అభివాదం చేసి ప్రారంభ ప్రసంగాన్ని ఆరంభించారు.

తషహ్హుద్, తఅవ్వుజ్, మరియు సూరతుల్ ఫాతిహా పారాయణం అనంతరం, హుజూర్ గారు సూరా ఆల్ ఇమ్రాన్ 194వ సూక్తిని చదివి దాని అనువాదాన్ని వినిపించారు. ఆ తరువాత హుజూర్ ఇలా అన్నారు:

"ఈ రోజు మనమందరం ఇక్కడ సమావేశమవ్వడానికి ప్రధాన కారణం ఏమిటనగా, అల్లాహ్ తఆలా తన ప్రత్యేక కృపతో మనకు హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం)ను స్వీకరించే భాగ్యాన్ని ప్రసాదించాడని ప్రకటించడం మరియు వ్యక్తపరచడం. వారు (అ) మన దృష్టిని అల్లాహ్ తఆలా మరియు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఆజ్ఞలను అనుసరించే దిశగా మళ్లించారు. అలాగే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (స) ఆదేశాలను అనుసరించి నప్పుడే మన ఇహ మరియు పరలోకాలు సఫలం అవుతాయని స్పష్టంగా తెలియ జేశారు."

అనంతరం హుజూర్ సూరా ఆల్ ఇమ్రాన్ 194వ సూక్తిని ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: 'మన ఆచరణ ఈ దివ్య బోధనలకు అనుగుణంగా లేకపోతే, మనం విశ్వాసులు అని చేసే ప్రకటన పూర్తిగా అర్థరహితంగా, శూన్యంగా మారుతుంది."

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) ఇలా పేర్కొన్నారు: నిజమైన విశ్వాసం మనలో ఏర్పడిందో లేదో మనం ఆత్మపరిశీలన చేసుకోవాలి. నిజమైన విశ్వాసంను పొందడానికి అల్లాహ్ తఆలా ఆజ్ఞలను అన్వేషించి, నిజమైన విశ్వాసికి అవసరమైన లక్షణాలు మనలో ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలించుకోవాలి. హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) మన ముందుంచిన ప్రమాణాలు ఏమిటో కూడా మనం గ్రహించాలి.

ఆ తరువాత హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) వారి ఉల్లేఖనాల వెలుగులో విశ్వాసం యొక్క నిజమైన స్వరూపాన్ని వివరించారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) వారి ఉల్లేఖనాలను ప్రస్తావిస్తూ హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: ఒకవేళ మనిషికి అల్లాహ్ యొక్క ఉనికిపై నిజమైన విశ్వాసం ఉంటే, అతడు పాపం వైపు వెళ్లడం అసాధ్యమవుతుంది. అలాగే, మానవ జీవితపు పరమార్థం తక్వా ను సంపాదించడమేనని, తక్వా లేకుండా పాపాల నుండి రక్షించుకోవడం అసాధ్యమని కూడా వివరించారు.

పాపం గురించి హుజూర్ అన్వర్ ఇలా పేర్కొన్నారు: మనిషి తనను తాను ఒంటరివాడిగా భావించినప్పుడు మాత్రమే పాపం వైపు మొగ్గుతాడు. తాను ఒంటరి వాడిననే భావన నాస్తిక భావజాలానికి చెందినదని హుజూర్ గారు వివరించారు.

దైవభీతి యొక్క ప్రాముఖ్యతను విపులంగా వివరిస్తూ హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు: ఖుర్ఆన్ కూడా దైవభీతి పదంతోనే ప్రారంభమవుతుంది. ఖుర్ఆన్ రెండవ సూరా ప్రారంభంలోనే "హుదన్ లిల్ ముత్తఖీన్" (తక్వా గలవారికి మార్గదర్శకం) అనే పదాలు వస్తాయి. మనిషిలో దైవభీతి ఏర్పడినప్పుడే, అది పాపానికి దారితీసే అన్ని మార్గాలను మూసివేస్తుంది.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: దైవభీతి కంటే గొప్ప విజయం మరొకటి లేదు. ఈ కాలంలో దైవభీతి చాలా అవసరం. అల్లాహ్ పంపిన ప్రవక్తలు ప్రపంచంలోకి రావడానికి ముఖ్య ఉద్దేశ్యం దైవభీతిని స్థాపించడమే. ఈ యుగంలో హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) కూడా దైవభీతిని సంపాదించుకోవాల్సిన అవసరంపై ప్రత్యేకంగా దృష్టి ఆకర్షించారు.

ముత్తఖీ (తక్వా గల వ్యక్తి) గురించి హుజూర్ అన్వర్ ఇలా పేర్కొన్నారు: ముత్తఖీకే నిజమైన రక్షణ లభిస్తుంది. అతనికి ఊహించని మార్గాల ద్వారా అల్లాహ్ ఉపాధిని ప్రసాదిస్తాడు. అలాగే ఒక హదీస్ ప్రకారం, అల్లాహ్ దైవభీతి గల వ్యక్తికి సంరక్షకుడిగా (వలీగా) మారుతాడు.

నమాజ్‌ను క్రమం తప్పకుండా ఆచరించే విషయంను గురించి హుజూర్ అన్వర్ మాట్లాడుతూ, ప్రతి ముస్లింకు రోజుకు ఐదు సార్లు నమాజ్ విధిగా నిర్ణయించబడిందని, దాని ద్వారా అల్లాహ్ పట్ల ప్రేమ మరియు ఆయన మహిమ మన హృదయాల్లో మరింత పెరుగుతాయని తెలిపారు.

చివరగా, నిజమైన విశ్వాసం అనగా మన అవసరాలన్నింటినీ కేవలం అల్లాహ్ తఆలా ఎదుట మాత్రమే ఉంచడమేనని హుజూర్ అన్వర్ గుర్తు చేశారు. అలాగే హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) ఇచ్చిన ఒక అందమైన ఉదాహరణను ప్రస్తావిస్తూ, పగలు మరియు రాత్రి ఒకేసారి కలిసి ఉండలేనట్లే, నిజమైన విశ్వాసం మరియు పాపం కూడా ఒకే చోట కలిసి ఉండలేవు అని వివరించారు.

ఈ ప్రసంగంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి ఉపదేశాల వెలుగులో హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) గారు ఇలా తెలిపారు: బైఅత్ యొక్క నిజమైన సారాంశాన్ని వివరించారు. కేవలం బైఅత్ చేసినంత మాత్రాన సరిపోదు. దాని అసలు ఉద్దేశ్యం నెరవేరే వరకు నిజమైన విముక్తి లభించదు. ఒక వ్యక్తి స్వయంగా ఆచరణలో ఉండకపోతే బైఅత్ వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) సత్కార్యాలు (ఆమాలె సాలిహా) మరియు ఇస్తిగ్ఫార్ (అల్లాహ్ క్షమాపణ కోరడం) గురించి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి గంభీరమైన, జ్ఞానపూర్వకమైన ఉల్లేఖనాలను చదివి వినిపించారు.

జమాఅత్ సభ్యులకు పవిత్ర ఖుర్ఆన్ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) " ఖుర్ఆన్‌ను కథల పుస్తకంలా చదవకూడదు, ఖుర్ఆన్ ఒక దివ్య జ్యోతి, సజీవమైన మరియు ప్రకాశవంతమైన గ్రంథం" అని తెలిపారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) వారి ప్రభావవంతమైన మాటల ద్వారా అహ్మదీయ జమాఅత్ యొక్క గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ, జమాఅత్‌లో చేరిన వారి జీవితాలు సాధారణ ప్రపంచ ఆకంక్షాలు కల్గిన వారి జీవితాల్లా ఉండకూడదని హుజూర్ అన్వర్ దృష్టి ఆకర్షించారు. "మనం జమాఅత్‌లో చేరాం, ఇక ఆచరణ అవసరం లేదు" అని భావించడం పనికి రాని స్థితి అని, అల్లాహ్ అలాంటి స్థితిని ఇష్టపడదని హుజూర్ గారు పేర్కొన్నారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తమ జమాఅత్ సభ్యులకు చేసిన ఉపదేశాలలో, హుజూర్ అన్వర్ ప్రస్తావించిన కొన్ని ముఖ్యమైనవి ఇవి:

(1) నాతో సంబంధం కలిగి ఉంటే, నా లక్ష్యాలు మరియు ఉద్దేశాలను నెరవేర్చండి.

(2) మీ ఆచరణ ద్వారా మీరు సత్యవంతుల సమూహానికి చెందినవారని నిరూపించండి.

(3) కొత్త జీవితాన్ని గడిపే వ్యక్తులుగా మారండి.

ప్రసంగం ముగింపులో హుజూర్ అన్వర్ గారు "ప్రపంచం కొరకు మరియు ముస్లిం సమాజం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయాలని కోరుతూ, ఈ రోజుల్లో ప్రపంచం యుద్ధం వైపు సాగుతున్నందున అల్లాహ్ దానిని కాపాడాలని దుఆలు చేయండి. అలాగే, ప్రపంచంలో ఇస్లాం పతాకాన్ని ఎగురవేసే వారిగా మనలను అల్లాహ్ తీర్చిదిద్దాలని ప్రార్థించాలి ' అని తెలిపారు.

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) వారి ఈ ప్రసంగం సాయంత్రం 6 గంటల 12 నిమిషాలకు ముగిసింది. అనంతరం దుఆతో ఈ సమావేశం ముగిసింది.

అల్లాహ్ తఆలా మనందరికీ హుజూర్ అన్వర్ వారి ఉపదేశాలను శ్రద్ధగా వినే, అవగాహన చేసుకునే మరియు వాటిని ఆచరించే భాగ్యాన్ని ప్రసాదించుగాక!.

ఆమీన్.

(అల్-ఫజల్ ఇంటర్నేషనల్ సౌజన్యంతో)

# జుమా ప్రసంగము

**కొన్నిసార్లు ఒక వ్యక్తి తీవ్రమైన ఆపదలో చిక్కుకుంటాడు, దాని నుండి బయటపడటానికి లేదా విజయం సాధించడానికి అబద్ధం చెప్పడం తప్ప మరో మార్గం కనిపించదు. అలాంటి సమయంలోనే అతని స్వభావంలో సత్యమా లేక అసత్యమా ఉందో పరీక్షించబడుతుంది.**

---

**అన్ని పరిస్థితిలోనూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సత్యానికే ప్రాధాన్యత ఇచ్చేవారు. అసత్యం వైపు ఎప్పుడూ మొగ్గుచూపలేదు. వారు (అ) తన అనుచరులను ఎల్లప్పుడూ సత్యవంతులుగా ఉండమని ఉపదేశించారు. అంతేకాక, బైఅత్ యొక్క షరతులలో ఒకటి అబద్ధాన్ని అసహ్యించుకోవడం మరియు సత్యంపై దృఢంగా నిలిచి ఉండడం కూడ గలదు.**

**సయ్యిద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 1 మే 2026 ( 1 హిజ్రత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

ఈ రోజు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి నిజమైన సేవకుడైన హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి జీవితం మరియు వ్యక్తిత్వం నుండి కొన్ని సంఘటనలను మీ ముందు ప్రస్తావించబోతున్నాను. ఇవి వారు (అ) ఎట్టి పరిస్థితుల్లోనైనా సత్యాన్నే నిలబెట్టారని, సత్యంపై దృఢంగా నిలిచారని, అంతేకాక ఈ విషయంలో తన ప్రత్యర్థులకు కూడా సవాలు చేశారని స్పష్టంగా చూపిస్తాయి.

మొదటగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి ప్రధాన ప్రత్యర్థులలో ఒకరైన ముహమ్మద్ హుస్సైన్ బటాల్వీ సాహిబ్ చేసిన ఆరోపణకు హుజూర్ (అ) ఇచ్చిన సమాధానాన్ని ప్రస్తావిస్తాను. బటాల్వీ సాహిబ్ హుజూర్ (అ)ను అవిశ్వాసి (కాఫిర్) మరియు అబద్ధకుడని ఆరోపించారు. దీనికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇచ్చిన సమాధానం కూడ అంతే స్పష్టమైనది, బహిరంగమైనది మరియు సవాలుతో కూడినది. నిష్పక్షపాతంగా తీర్పు చెప్పేవారు ఇలాంటి ఆరోపణలను ఎప్పటికీ అంగీకరించలేరు. అయితే, అజ్ఞానపు తెర కళ్లపై కప్పబడి ఉన్నవారు మాత్రం వెలుగును చూడలేరు. నేటి కొంతమంది మతపెద్దల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

ఒక సందర్భంలో, ముహమ్మద్ హుస్సైన్ బటాల్వీ సాహిబ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారికి ఒక ఉత్తరం రాశారు. అందులో హుజూర్ (అ)ను ఇస్లాం వ్యతిరేకి, అవిశ్వాసి మరియు అబద్ధకుడని (నవూజుబిల్లాహ్) పేర్కొన్నారు. దీనికి ప్రత్యుత్తరంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సవివరంగా ఇలా వ్రాశారు:

"మీరు సత్యాన్వేషకుని దృష్టితో నా జీవితాన్ని పరిశీలిస్తే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను ఎల్లప్పుడూ అసత్యపు మలినత నుండి కాపాడినట్లు స్పష్టమైన ఆధారాలను కనుగొంటారు. ఒకప్పుడు బ్రిటిష్ న్యాయస్థానాల్లో నా ప్రాణం, నా గౌరవం తీవ్రమైన ప్రమాదంలో పడిన సందర్భాలు కూడా వచ్చాయి. అప్పుడు ప్రతి న్యాయవాది నాకు అబద్ధం చెప్పమని మాత్రమే సలహా ఇచ్చాడు. (అందరూ, 'మీరు అబద్ధం చెబితే కేసు సహజంగానే మీకు అనుకూలంగా పరిష్కారమవుతుంది' అని అన్నారు.) కానీ మహోన్నతుడైన అల్లాహ్ నాకు సత్యం కోసం నా ప్రాణాన్ని, గౌరవాన్ని కూడా లెక్క చేయకుండా నిలబడే శక్తిని ప్రసాదించాడు. కాబట్టి, అల్లాహ్ కృపతో నేను నా ప్రాణం, గౌరవం కంటే సత్యాన్నే ఎంచుకున్నాను. సత్యం కోసమే నేను అనేక ఆర్థిక కేసుల్లో భారీ నష్టాలను కూడా భరించాను. అలాగే, ఎన్నోసార్లు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పట్ల ఉన్న భయంతో నా తండ్రికి, నా సోదరునికి వ్యతిరేకంగానైనా సాక్ష్యం చెప్పాను. కానీ సత్యాన్ని మాత్రం ఎప్పుడూ విడిచిపెట్టలేదు."

మరల ఇలా తెలిపారు:"నేను ఈ గ్రామంలో (ఖాదియాన్‌లో) మరియు బటాలాలో జీవితాంతం నివసించాను. కానీ నా నోటి నుండి ఎప్పుడైనా ఒక అబద్ధమైనా వెలువడిందని ఎవరైనా నిరూపించగలరా? నేను మొదటి నుంచే అల్లాహ్ ప్రీతికై మనుషుల విషయంలో అబద్ధం చెప్పకుండా ఉండి, సత్యం కోసం పదేపదే నా ప్రాణాన్ని, ఆస్తిని త్యాగం చేసినపుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ విషయంలో నేను ఎందుకు అబద్ధం చెబుతాను?"

బటాల్వీ సాహిబ్ తన ఉత్తరంలో, "అబద్ధం చెప్పడం మరియు మోసం చేయడం ఆయనలో ఎంతగా నాటుకుపోయిందనగా, అది ఆయన స్వభావంలో భాగమైపోయింది" (నవూజుబిల్లాహ్) అని కూడా వ్రాశారు. వాస్తవానికి, ఇది మౌల్వీ సాహిబ్ చేసిన స్పష్టమైన అసత్య ఆరోపణ, నిరాధారమైన కల్పన మాత్రమే. దీనికి ఆయన వద్ద ఎలాంటి సాక్ష్యం కూడా లేదు. దీనికి ప్రతిస్పందిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా వ్రాశారు:

"షేఖ్ సాహిబ్! దైవభీతిగల మరియు సద్గుణవంతుడైన వ్యక్తి పూర్తిగా పరిశీలించకుండా తన సహోదరునిపై అవిశ్వాసం లేదా దురాచారం వంటి ఆరోపణ చేయడానికి సాహసించదు. ఒకవేళ అలాంటి ఆరోపణ చేస్తే, దానికి సరైన, స్పష్టమైన, తిరుగులేని సాక్ష్యాలను సమర్పిస్తాడు, చూసేవారికి పగలు వెలిగినంత స్పష్టంగా నిజం తెలిసిపోతుంది. కాబట్టి, మీలో ఈ రెండు లక్షణాలు ఉన్నట్లయితే, మహిమగల ప్రభువైన, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పేరు మీద మిమ్మల్ని నేను ప్రమాణపూర్వకంగా కోరునదేమనగా, దైవ ప్రవక్త(స) కూడా అల్లాహ్ పేరిట చేసిన ప్రమాణానికి ఎంతో ఆలోచించి సమాధానం ఇచ్చేవారు కావున, మీరు కూడ నాలో ఉన్నాయని భావిస్తున్న ఈ రెండు దోషాలను నిరూపించండి: మొదటిది, నేను ఇస్లాం మతానికి శత్రువును, కాఫిర్‌ను. రెండవది, నేను అబద్ధం చెప్పేవాడిని." రెండు ఆరోపణలు చేయబడ్డాయి. మొదటిది: నేను అవిశ్వాసిని, ముస్లిం కాదని. సరే, దాన్ని నిరూపించాలి. రెండవది: నేను అబద్ధకుడని. అదీ నిరూపించాలి. ఆ తర్వాత హుజూర్ (అ) ఇలా కొనసాగించారు:

" దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: 'మాటల్లో అత్యంత సత్యవంతుడైన వ్యక్తి కలలు కూడా అత్యంత సత్యమైనవిగా ఉంటాయి.' ఈ హదీస్‌లో దైవ ప్రవక్త (స), సత్యవంతుల లక్షణంగా వారి కలలు కూడా నిజమయ్యే విషయాన్ని పేర్కొన్నారు.కావున మీరు ఇప్పుడే నేను దైవ ప్రవక్త (స)ను విశ్వసిస్తున్నానని" అనగా మౌల్వీ సాహెబ్ తెలిపాడు. " ప్రకటించారు. కాబట్టి, మీరు కపటంతో ఇలా చెప్పలేదని, నిజంగా ప్రవక్త (స)ను మీరు విశ్వసిస్తున్నారని, వారి మాటలు సత్యమని నమ్ముతున్నట్లయితే, రండి!,ఈ ప్రామాణికత ఆధారంగా మనం ఇద్దరం పరీక్షించుకుందాం. ఎవరు నిజాయితీపరులో, ఎవరు సహజంగా అబద్ధానికి అలవాటు పడినవారో తేలిపోతుంది. అలాగే, మహోన్నతుడైన అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రకటించాడు:

''لَهُمُ الْبُشْرٰى فِي الْحَيٰوةِ الدُّنْيَا'' అనగా వారికి ఈ లోక జీవితంలోనే శుభవార్తలు ఉన్నాయి.' అంటే, ఇతరులతో పోలిస్తే విశ్వాసుల కలలు నిజమవడం వారి ప్రత్యేక లక్షణం. మీరు ఇప్పుడే పవిత్ర ఖుర్‌ఆన్‌ను కూడా విశ్వసిస్తున్నానని చెప్పారు. చాలా మంచిది! మరి, పవిత్ర ఖుర్‌ఆన్ నిర్దేశించిన ఈ ప్రామాణికం ప్రకారం కూడా ఎవరిలో నిజమైన విశ్వాసి లక్షణం ఉందో పరీక్షిద్దాం." ఈ రెండు పరీక్షలను ఈ విధంగా నిర్వహించవచ్చు: బటాలా, లాహోర్ లేదా అమృతసర్‌లో ఒక సభ ఏర్పాటు చేయవచ్చు. ఆ సభకు ఇరు పక్షాల స్వప్నాలకు సంబంధించిన సాక్షులు హాజరు కావాలి. అనంతరం, మన ఇద్దరిలో ఎవరి స్వప్నాలు నిర్ణయాత్మకమైన మరియు నమ్మదగిన ఆధారాల ప్రకారం ఎక్కువ సత్యమైనవిగా నిరూపితమవుతాయో, వారి ప్రత్యర్థికి అక్కడికక్కడే కజ్జాబ్ (పరమ అబద్ధీకుడు), దజ్జాల్ (మోసగాడు), కాఫిర్ (అవిశ్వాసి), అక్ఫర్ (అత్యంత పెద్ద అవిశ్వాసి), మల్‌ఊన్ (శపించబడినవాడు) లేదా తగినవిగా భావించే ఇతర బిరుదులతో కూడిన 'పతకం' ధరింపజేయాలి. మీ గత స్వప్నాల సత్యతను మీరు నిరూపించలేకపోతే, మీకు నేను ఆరు నెలల గడువు ఇస్తున్నాను. ఆ కాలంలో అదృశ్య విషయాలకు సంబంధించిన సమాచారాన్ని కలిగిన మీ స్వప్నాలను కొన్ని వార్తాపత్రికల్లో ప్రచురించండి. నేను మాత్రం గత స్వప్నాలకు సంబంధించిన ఆధారాలను మాత్రమే కాకుండా, ఇన్షా అల్లాహ్, నా ప్రస్తుత స్వప్నాలను కూడా మీ స్వప్నాలకు ప్రతిగా ప్రచురిస్తాను. ఎలాగైతే మీరు ఖుర్‌ఆన్‌ను మరియు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసిస్తున్నట్లు ప్రకటించినట్లే, నేనూ కూడ నా మనస్ఫూర్తిగా, ఆ ప్రియమైన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మరియు ఆ మహిమాన్వితమైన గ్రంథమైన పవిత్ర ఖుర్‌ఆన్‌ను విశ్వసిస్తున్నాను. కాబట్టి ఈ పరీక్షల ద్వారానే ఎవరు సత్యవంతులో, ఎవరు అసత్యవాదులో

తేలిపోతుంది.ఒకవేళ నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు పవిత్ర ఖుర్ఆన్ నిర్దేశించిన ఈ పరీక్షలో ఓడిపోతే, మీరు సత్యవంతులవుతారు. అప్పుడు, మీ అభిప్రాయం ప్రకారం, నేను కాఫిర్ (అవిశ్వాసి), దజ్జాల్ (మోసగాడు), సైతాను, కజ్జాబ్ (పరమ అబద్ధికుడు), మరియు కల్పిత కథలు సృష్టించేవాడుగా పరిగణించబడతాను. అంతేకాక, నా గురించి మీరు వ్యాప్తి చేసిన ఆరోపణలన్నీ నిజమని కూడా భావించబడతాయి. ఉదాహరణకు, బరాహీన్-ఎ-అహ్మదీయ్యా ద్వారా ప్రజలను మోసం చేశానని, దుఆలు అంగీకరించబడతాయని చెప్పి వారి ధనాన్ని స్వాధీనం చేసుకున్నానని, అక్రమ సంపదతో జీవించానని మీరు చేసిన ఆరోపణలన్నీ సమర్థించబడినట్లవుతుంది. కానీ, విశ్వాసులను మరియు నిజమైన నీతిమంతులను అనుసరించే సర్వశక్తిమంతుడైన దేవుని కృప వలన నేను సత్యవంతుడను అని నిరూపించబడినచో, అప్పుడు మీరే స్వయంగా చెప్పండి, మీరు నాపై ప్రయోగించిన ఈ బిరుదులన్నీ మీరే ప్రకటించుకున్న మతపెద్ద హోదాకు వర్తించవా? లేక మీకు ఇంకా తప్పించుకునే మార్గం మిగులుతుందా? ఇదే నా సవాలు. మీరు నాకు తీవ్రమైన బాధను మరియు వేదనను కలిగించారు. నేను చాలాకాలం సహనంతో వ్యవహరించాను. అయినప్పటికీ, మీ అంతరంగాన్ని పూర్తిగా తెలిసిన ఆ సర్వశక్తిమంతుడైన దేవునికి మీరు ఏమాత్రం భయపడడం లేదు. అతడు మీ గురించి మరియు మీలాంటి మనస్తత్వం కలిగిన వారి గురించి ఒక భవిష్యవాణి ద్వారా నాకు ఈ విధంగా తెలియజేశాడు: **ఇన్నీ ముహీనున్ మ్మన్ అరాద ఇహానతక**. అనగా నేను "నిన్ను అవమానించ దలచిన వానిని నేను అవమానపరుస్తాను."

అందువల్ల, మీరు చేసిన ఈ ఆరోపణలన్నీ అసత్యమని సర్వశక్తిమంతుడైన దేవుడు త్వరలోనే నిరూపించే సమయం సమీపంలోనే ఉందని నిశ్చయంగా తెలుసుకోండి. అపవాదులు ప్రచారం చేసేవారు, అబద్ధికులు అనుభవించే అవమానాన్ని మరియు నిందను ఆయన మీపై కూడా కలిగిస్తాడు. మీరు ఖుర్ఆన్‌ను మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసిస్తున్నామని చెప్పుకుంటున్నారు. కాబట్టి మీ వాదన నిజమైతే, ఈ పరీక్ష కోసం ముందుకు రండి. అప్పుడు సర్వశక్తిమంతుడైన దేవుడే మీకూ నాకూ మధ్య తీర్పు ఇస్తాడు. ఎవరు అబద్ధికులో, ఎవరు దజ్జాలో, వారే అవమానానికి గురవుతారు. ఈ క్షణంలో నా హృదయంలో ఒక సత్యసాక్ష్యం ఉద్భవిస్తోంది. దానిని నేను అణచలేను, ఎందుకంటే అది నా నుండి వచ్చినది కాదు. అది నా ప్రభువు నుండి వచ్చిన బలమైన దైవప్రేరణ. మీరు నన్ను అవిశ్వాసిగా భావించి, అబద్ధం చెప్పడం నా సహజ స్వభావమని ప్రకటిస్తున్నందున, సర్వోన్నతుడైన అల్లాహ్ పేరు మీద మిమ్మల్ని ప్రమాణపూర్వకంగా కోరుతున్నాను. పై విధంగా నాతో వెంటనే ఈ పరీక్షలో పాల్గొనండి. అప్పుడు పవిత్ర ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి బోధనల ప్రకారం ఎవరు అబద్ధికులో, దజ్జాలో, అవిశ్వాసులో స్పష్టంగా తేలిపోతుంది."

**(ఆయినా-ఎ-కమాలాత్-ఎ-ఇస్లాం, రూహానీ ఖజాయిన్, సంపుటి 5, పేజి 289-295)**

ఈ క్రమంలోనే హుజూర్ (అ) ఇలాపేర్కొన్నారు: సత్యవంతులను పరీక్షించడానికి మరో మార్గం కూడా ఉంది. దానిని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా చూపుతాడు. అదేమనగా,

కొన్నిసార్లు ఒక వ్యక్తి తీవ్రమైన ఆపదలో చిక్కుకుంటాడు, దాని నుండి బయటపడటానికి లేదా విజయం సాధించడానికి అబద్ధం చెప్పడం తప్ప మరో మార్గం కనిపించదు. అలాంటి సమయంలోనే అతని స్వభావంలో సత్యమా లేక అసత్యమా ఉందో పరీక్షించబడుతుంది.

మౌల్వీ సాహిబ్ హుజూర్ అలైహిస్సలాం స్వభావంలో అబద్ధం ఉందని వ్రాశారు. దీనికి ప్రతిస్పందనగా హుజూర్ (అలైహిస్సలాం) ఇలా వ్రాసారు: పరీక్షల సమయంలోనే ఎవరి స్వభావంలో సత్యం ఉందో లేక అసత్యం ఉందో అనేది బయట పడుతుంది.

"అటువంటి అత్యంత క్లిష్ట సమయంలో అతని నాలుక సత్యాన్నే పలుకుతుందా? లేక తన ప్రాణం, గౌరవం, సంపదలపై భయంతో అసత్యాన్ని ఆశ్రయిస్తుందా? అనే విషయం అప్పుడు స్పష్టమవుతుంది. "నా వినయపూర్వక జీవితంలో ఇటువంటి అనేక అనుభవాలు ఎదురయ్యాయి. వాటి వివరాలన్నీ చెప్పాలంటే ఈ వివరణ చాలా పొడవుగా మారుతుంది. అయినప్పటికీ, వాటిలో మూడు ఉదాహరణలను ఇక్కడ ప్రస్తావిస్తున్నాను. దీనికి నా ఉద్దేశ్యం ఏమిటంటే, మీకు కూడా సత్యప్రేమను పరీక్షించిన ఇటువంటి సందర్భాలు ఎప్పుడైనా ఎదురైతే ఉంటే, వాటిని కూడా తగిన ఆధారాలతో ప్రచురించండి అని సర్వోన్నతుడైన అల్లాహ్ పేరు మీద మిమ్మల్ని కోరుతున్నాను. అప్పుడు మీరు కేవలం ఖాళీ వాదన చేయడం లేదని, కష్టసమయాల్లో కూడా సత్యాన్ని విడిచిపెట్టలేదని ప్రజలకు తెలుస్తుంది." అనగా, తాను ఎప్పుడూ అబద్ధం చెప్పలేదని ఎవరైనా వాదిస్తే, ఈ సవాలును స్వీకరించాలని హుజూర్ (అ) ఉద్దేశ్యం. హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) తన స్వంత జీవితంలోని ఉదాహరణలను సమర్పిస్తూ, వాటిలో మూడింటిని వివరిస్తానని చెప్పారు. ఆయన ఇలా వ్రాశారు:

"వాటిలో ఒకటి ఏమిటంటే, నా తండ్రి మరణించిన తర్వాత, నా అన్నగారైన దివంగత మిర్జా గులామ్ ఖాదిర్ మరియు నేను, లాహోర్‌కు చెందిన మిర్జా ఆజమ్ బేగ్ ప్రేరణతో, ఖాదియాన్ ఎస్టేట్‌లోని ఉమ్మడి యజమానులచే జిల్లా కోర్టులో దావా వేయబడ్డాము. ఆ దావాలో వారు ఆ ఎస్టేట్‌పై యాజమాన్య హక్కును కోరారు. అయితే, ఆ ఎస్టేట్ యాజమాన్యంతో వారికి వాస్తవానికి ఎలాంటి సంబంధం లేదని నాకు బాగా తెలుసు. ఎందుకంటే సిక్కుల పాలన కాలంలోనే ఆ ఎస్టేట్ మా కుటుంబం చేతుల నుంచి పోయింది. ఆ యాజమాన్య హక్కు పూర్తిగా అంతరించి పోయింది. తరువాత నా తండ్రి ఇతర ఎస్టేట్లతో పాటు దీనిని తిరిగి పొందడానికి సుమారు 8,000 రూపాయల వరకు ఖర్చు చేసి, నష్టాన్ని భరించారు. కానీ ఆ వ్యక్తులు ఒక్క పైసా కూడా సహాయం చేయలేదు. "ఆ దావా విజయవంతం కావాలని నేను ప్రార్థిస్తున్న సమయంలో నాకు ఈ దివ్యవాణి (వహీ) లభించింది: **ఉజీబూ కుల్ల దుఆయిక ఇల్లా ఫీ షురకాఇక** అనగా 'నీ ప్రార్థనలన్నింటినీ నేను అంగీకరిస్తాను, కానీ నీ సహవారసుల విషయంలో మాత్రం కాదు.' (అంటే, ఈ ప్రార్థన అంగీకరించబడదు.)

కావున "ఈ దివ్యవాణి తర్వాత, నా అన్న గారిని మరియు మా కుటుంబం లోని పురుషులు, మహిళలందరినీ, వారిలో కొందరు ఇప్పటికీ జీవించి ఉన్నారు, ఒక చోట సమీకరించి, ఉమ్మడి యజమానుల దావాను కొనసాగించవద్దని, ఎందుకంటే అది అల్లాహ్ సంకల్పానికి విరుద్ధమని, స్పష్టంగా చెప్పాను. ఈ కేసును కొనసాగించడం అల్లాహ్‌కు ఇష్టంలేదని వివరించాను. అయితే వారు నా సలహాను అంగీకరించలేదు. చివరికి వారు ఆ కేసులో ఓడిపోయారు. "నా విషయానికి వస్తే, వేలాది రూపాయల నష్టాన్ని నేను ధైర్యంగా భరించాను. (అల్లాహ్ ఆ వ్యవహారాన్ని అక్కడితో నిలిపివేయాలని నిర్ణయించినందున, హుజూర్ (అ) అదే నిర్ణయాన్ని అంగీకరించి కేసును కొనసాగించలేదు.) ప్రస్తుతం నా శత్రువులుగా ఉన్నవారందరూ కూడా ఈ విషయానికి సాక్షులే. ఎస్టేట్‌కు సంబంధించిన వ్యవహారాలన్నీ నా అన్నగారి చేతుల్లో ఉండేవి. నేను మళ్లీ మళ్లీ ఆయనకు సలహా ఇచ్చాను. కానీ ఆయన అంగీకరించలేదు. చివరికి ఆయనే ఆ నష్టాన్ని భరించాల్సి వచ్చింది."

హుజూర్ (అ) ఇచ్చిన రెండవ ఉదాహరణ ఈ విధంగా ఉంది:

"సుమారు పదిహేను లేదా పదహారు సంవత్సరాల క్రితం, లేదా బహుశా అంత కంటే ముందే, నేను, అమృత్‌సర్‌లో నివసించే మరియు న్యాయవాది అయిన రల్లియా రామ్ అనే ఒక క్రైస్తవుడి ముద్రణాలయానికి ఒక వ్యాసాన్ని ముద్రణ కోసం పంపాను. అతను ఒక వార్తాపత్రిక యజమాని మరియు సంపాదకుడు కూడా. ఆ వ్యాసం ఇస్లాం మతానికి మద్దతుగా, ఆర్య సమాజానికి ప్రత్యుత్తరంగా రాయబడింది. ఆ వ్యాసాన్ని రెండు వైపులా తెరిచి ఉన్న పోస్టల్ ప్యాకెట్‌లో పంపాను. అదే ప్యాకెట్‌లో ఆ వ్యాసంతో పాటు ఒక లేఖను కూడా ఉంచాను. ఆ లేఖలో ఇస్లాం మతానికి మద్దతుగా, ఇతర మతాల ఖండనగా కొన్ని వ్యాఖ్యలు ఉండటంతో పాటు, ఆ వ్యాసాన్ని తప్పకుండా ముద్రించాలని కూడా కోరాను. మతపరమైన భేదాభిప్రాయాల కారణంగా ఆ క్రైస్తవ సంపాదకుడు ఆగ్రహించాడు. యాదృచ్ఛికంగా, నాకు వ్యతిరేకంగా చర్య తీసుకోవడానికి అతనికి ఒక అవకాశం దొరికింది. ఎందుకంటే, అటువంటి వేరొక లేఖను పోస్టల్ ప్యాకెట్‌లో ఉంచి పంపడం అప్పటి చట్టప్రకారం నేరం. నాకు ఆ విషయం అసలు తెలియదు. ఆ నేరానికి పోస్టల్ చట్టాల ప్రకారం గరిష్ఠంగా రూ.500 జరిమానా లేదా ఆరు నెలల వరకు కారాగార శిక్ష విధించవచ్చు. అందువల్ల, అతను సమాచారదారుడిగా మారి, పోస్టల్ అధికారుల ద్వారా నా మీద కేసు నమోదు చేయించాడు. ఈ కేసు గురించి నాకు అధికారిక సమాచారం అందకముందే, సర్వోన్నతుడైన అల్లాహ్ నాకు ఒక దర్శనం (స్వప్నం) ద్వారా చూపించాడు. అందులో రల్లియా రామ్ అనే న్యాయవాది నన్ను కాటేయడానికి ఒక పామును నా దగ్గరకు పంపాడు. కానీ నేను ఆ పామును చేపను వేయించినట్లు వేయించి తిరిగి అతని దగ్గరకు పంపాను. ఈ దర్శనం ద్వారా నాకు అర్థమైనది ఏమిటంటే, ఆ కేసులో వెలువడబోయే తీర్పు, అది ఏర్పడిన విధానం వల్ల, భవిష్యత్తులో న్యాయవాదులకు ఉపయోగపడే ఒక న్యాయపూర్వక ఆదర్శముగా నిలుస్తుందనే సూచన. సంక్షిప్తంగా చెప్పాలంటే, ఈ నేరం కారణంగా నన్ను గుర్దాస్‌పూర్ జిల్లా ప్రధాన న్యాయ కేంద్రానికి హాజరుకావాలని సమన్లు జారీ చేశారు. ఆ కేసు విషయంలో నేను సంప్రదించిన న్యాయవాదులందరూ, అబద్ధాన్ని ఆశ్రయించడం తప్ప మరే మార్గమూ లేదని చెప్పారు. 'ఆ లేఖను నేను ప్యాకెట్‌లో పెట్టలేదని, రల్లియా రామ్‌నే ఆ లేఖను అందులో పెట్టి ఉండవచ్చని చెప్పండి' అని వారు నాకు సలహా ఇచ్చారు. అంతేకాకుండా, అలా చెప్పినట్లయితే కేసు సాక్షుల ఆధారంగా విచారించబడుతుందని, ఇద్దరు తప్పుడు సాక్షులను తీసుకొస్తే నేను నిర్దోషిగా విడుదల అవుతానని కూడా వారు నన్ను నమ్మబలికారు. ఇది తప్ప మరే

మార్గమూ కనిపించలేదు. కేసు చాలా క్లిష్టంగా ఉండేది; నేను విముక్తి పొందుతాననే ఆశ కూడా కనిపించలేదు. అయినప్పటికీ, నేను వారందరికీ ఇలా చెప్పాను: 'ఎట్టి పరిస్థితుల్లోనూ నేను సత్యాన్ని విడిచిపెట్టను. ఏది జరగాల్సి ఉంటే అది జరగనివ్వండి.' అదే రోజు లేదా మరుసటి రోజు నన్ను ఒక ఆంగ్లేయ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచారు. ప్రభుత్వ తరపున పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ ఫిర్యాదు దారుడిగా హాజరయ్యాడు. మేజిస్ట్రేట్ స్వయంగా నా వాంగ్మూలాన్ని తన చేతితో నమోదు చేయడం ప్రారంభించాడు. అన్నిటికంటే ముందుగా ఆయన నన్ను ఇలా ప్రశ్నించాడు: 'ఈ లేఖను మీరు ఆ ప్యాకెట్‌లో ఉంచారా? ఈ లేఖ, ఈ ప్యాకెట్ మీవేనా?' నేను ఏమాత్రం సంకోచించకుండా ఇలా సమాధానమిచ్చాను: 'అవును, ఈ లేఖ నాదే. ఈ ప్యాకెట్ కూడా నాదే. ఈ లేఖను ప్యాకెట్‌లో ఉంచి నేనే పంపాను. అయితే, ప్రభుత్వానికి పోస్టల్ రుసుము నష్టం కలిగించాలనే దురుద్దేశంతో నేను అలా చేయలేదు." అంటే, పోస్టేజీ చెల్లించకుండా ప్రభుత్వానికి నష్టం కలిగించాలనే ఉద్దేశం నాకు లేదు. " ప్యాకెట్‌లో ఉన్న వ్యాసాన్ని, ఆ లేఖ వ్యాసాన్ని నేను ఒకటిగానే భావించాను. అంతేగాని ఆ లేఖలో వ్యక్తిగత విషయమేమీ లేదు.' (అనగా ఆలేఖలో కూడ వ్యాసానికి చెందిన విషయమే ఉన్నది). నేను ఈ వాగ్మూలం ఇచ్చిన వెంటనే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆ ఆంగ్లేయ మేజిస్ట్రేట్ హృదయాన్ని నాకు అనుకూలంగా మార్చాడు. నా ప్రత్యర్థి అయిన పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎంతో పెద్ద హంగామా చేసి, చాలా సుదీర్ఘంగా ఆంగ్లంలో వాదించాడు. ఆయన చెప్పిన విషయాలు నాకు పూర్తిగా అర్థం కాలేదు. అయితే, ఆయన ప్రతిసారి ఒక అంశాన్ని ప్రస్తావించినప్పుడు, మేజిస్ట్రేట్ ఆంగ్లంలో "నో, నో ("లేదు, లేదు") అని చెప్పి దానిని తిరస్కరించే వాడని మాత్రం నాకు అర్థమైంది. చివరికి, వాది అయిన ఆ సూపరింటెండెంట్ తన వాదనను ముగించి తన కోపమంతా వెళ్లగక్కిన తర్వాత, మేజిస్ట్రేట్ కేవలం రెండు పంక్తుల్లో తన ఉత్తర్వును రాసి నాతో ఇలా అన్నాడు: "మీరు వెళ్లవచ్చు."ఇది విన్న వెంటనే నేను నా నిజమైన ఉపకారకుడైన ప్రభువు (అనగా సర్వశక్తిమంతుడైన అల్లాహ్) కు గాఢమైన కృతజ్ఞత తెల్పుతూ న్యాయస్థానం నుండి బయటకు వచ్చాను. ఒక యూరోపియన్ అధికారికి (ఫిర్యాదుదారు ఒక ఆంగ్లేయుడు) వ్యతిరేకంగా కూడా నాకు విజయం ప్రసాదించిన దేవునికి నేను కృతజ్ఞుడనయ్యాను. ఆ సమయంలో నేను సత్యానికి కట్టుబడి ఉన్నందువల్లే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నన్ను ఆ ఆపద నుండి రక్షించాడని నాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ కేసుకు ముందు నేను ఒక కల కూడా చూశాను. అందులో ఒక వ్యక్తి నా టోపీని తీసివేయడానికి చేయి చాచాడు. అప్పుడు నేను, "నీవు ఏమి చేస్తున్నావు?" అని అడిగాను. దానికి అతడు టోపీని నా తలపైనే ఉంచి, "పర్వాలేదు, పర్వాలేదు" అని చెప్పాడు.

ఆ తరువాత హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మూడవ సంఘటనను ఈ విధంగా వివరించారు: "నా కుమారుడు సుల్తాన్ అహ్మద్, మా కుటుంబానికి చెందిన భూమిపై ఒక హిందువు నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ అతనిపై దావా వేశాడు. అయితే, దావాపత్రంలో ఒక విషయం పొరపాటుగా నమోదు చేయబడింది. అది రుజువైతే, ఆ దావా కొట్టివేయబడేది. అలా జరిగితే, సుల్తాన్ అహ్మద్ మాత్రమే కాదు, నేను కూడా మా ఆస్తి హక్కులను కోల్పోవలసి వచ్చేది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ప్రత్యర్థి నన్ను సాక్షిగా పిలిపించాడు. (హుజూర్ (అ) సాక్ష్యం ఇస్తే, వారు చెప్పినదే న్యాయస్థానం అంగీకరిస్తుందని వారు భావించారు.) నేను బటాలాకు వెళ్లి, అక్కడి కోర్టులకు సమీపంలో నివసిస్తున్న సబ్-పోస్ట్‌మాస్టర్ బాబు ఫతేహ్ దిన్ ఇంట్లో బస చేశాను. ఆ కేసు ఒక హిందూ న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చింది. ఆయన పేరు ఇప్పుడు నాకు గుర్తు లేదు. అయితే, ఆయనకు ఒక కాలులో వైకల్యం ఉండేది. సుల్తాన్ అహ్మద్ తరపు న్యాయవాది నా వద్దకు వచ్చి, "కేసు ఇప్పుడు పిలవబడబోతోంది. మీరు ఏ విధంగా సాక్ష్యం ఇస్తారు?" అని అడిగాడు. నేను, "నిజాల ప్రకారమే, సత్యాన్నే చెబుతాను" అని చెప్పాను. అప్పుడు అతడు, "అలా అయితే మీరు కోర్టుకు రావాల్సిన అవసరం లేదు. నేను స్వయంగా వెళ్లి ఈ కేసును ఉపసంహరించుకుంటాను" అని అన్నాడు. (ఎందుకంటే నేను నిజం చెబితే కేసు వెంటనే ముగిసిపోతుందని అతనికి తెలుసు.) అలా నేను స్వయంగా, నా స్వంత చేతులతోనే, కేవలం సత్యం కోసమే ఆ కేసును నాశనం చేసుకున్నాను. దేవుని ప్రసన్నతను పొందడం కోసం సత్యాన్నే ఎంచుకున్నాను. ఆస్తి నష్టం గురించి ఏమాత్రం పట్టించుకోలేదు.

హజ్రత్ మసీహ్ అలైహిస్సలాం కోరుకున్నది దేవుని సంతోషం మాత్రమే.

"ఈ చివరి రెండు సంఘటనలకు కూడా తగిన ఆధారాలు ఉన్నాయి. మొదటి సంఘటనకు గుర్దాస్‌పూర్‌కు చెందిన న్యాయవాది షేఖ్ అలీ అహ్మద్, అలాగే సర్దార్ ముహమ్మద్ హయాత్ ఖాన్, సి.ఎస్.ఐ లు సాక్షులు. అంతేకాక, ఆ కేసు దస్తావేజులు గుర్దాస్‌పూర్ జిల్లా రికార్డుల్లో ఇప్పటికీ భద్రపరచబడి ఉండాలి. రెండవ సంఘటనకు బాబు ఫతేహ్ దిన్‌సాక్ష్యం, ఆ కేసు న్యాయవాది (ప్రస్తుతం ఆయన పేరు నాకు గుర్తు లేదు), అలాగే నేను ముందే ప్రస్తావించిన ఆ న్యాయమూర్తి సాక్షులు. ఆయనను బహుశా ఇప్పుడు లూధియానాకు బదిలీ చేసి ఉండవచ్చు. ఈ దావా సుమారు ఏడు సంవత్సరాల క్రితం దాఖలైంది. అంతేగాగా, బటాలాకు చెందిన పట్వారి నబీ బఖ్ష్ కూడా ఈ సంఘటనకు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాడని నాకు గుర్తుంది."

ఇప్పుడు, ఆ మతపెద్దను ఉద్దేశించి, హుజూర్ (అ) ఇలా పేర్కొంటున్నారు:

"ఓ హజ్రత్ షేఖ్ సాహిబ్! మీరు కూడా ఇంతటి తీవ్రమైన పరీక్షకు సంబంధించిన ఏదైనా సంఘటనను అనుభవించి ఉంటే, అందులో మీరు సత్యాన్ని మాట్లాడినట్లయితే మీ ప్రాణం, గౌరవం, ఆస్తి అన్నీ ప్రమాదంలో పడేవని తెలిసినా, అప్పుడు కూడ ఆస్తి గానీ, ప్రాణం గానీ లెక్కచేయకుండా సత్యానికే కట్టుబడి నిలిచి నట్లయితే, అల్లాహ్ పేరు మీద నేను మిమ్మల్ని కోరునదేమనగా, దానికి సంబంధించిన సంపూర్ణ ఆధారాలతో ఆ సంఘటనను ముందుకు తీసుకురండి. అయితే, ఈ కాలంలోని ఎక్కువమంది ముల్లాలు, మౌల్వీలు మాటలకే పరిమితమని నా నమ్మకం. వారు ఒక్క పైసా కోసం కూడా తమ విశ్వాసాన్ని అమ్మడానికి సిద్ధంగా ఉంటారు. ఎందుకంటే మన మహోన్నత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చివరికాలపు మౌల్వీలను సృష్టిలోనే అత్యంత చెడ్డవారిగా పేర్కొన్నారు. "అంతేకాక, మీరు కూడా ముజద్దిద్ (సంస్కర్త)గా విశ్వసించే దివంగత నవాబ్ సిద్దీక్ హసన్ ఖాన్, తన హిజాజ్-ఉల్-కిరామహ్ గ్రంథంలో 'చివరికాలం' అనగా ఇదే ప్రస్తుత కాలమని అంగీకరించారు. కాబట్టి, ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి మౌల్వీల భక్తిని, నీతిని అంగీకరించడమంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి వాక్యాన్ని అసత్యం చేయడమే అవుతుంది. అందువల్ల, మీ స్వీయ అనుభవాల నుంచి అలాంటి ఉదాహరణలను చూపించండి. కానీ మీరు అలాంటివి చూపించడంలో విఫలమైతే, మీకు భక్తి గురించి కేవలం ఒక వాదన మాత్రమే ఉందని, అయితే పరిశీలన లేకుండా ఏ వాదన కూడా ఆమోదయోగ్యం కాదని స్పష్టమవుతుంది. "మీ అంతరంగ స్థితి గురించి సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కే పూర్తిగా తెలుసు. మీరు ఎప్పుడైనా అబద్ధాలు, కల్పితాలతో మిమ్ములను మీరు కలుషితం చేసుకున్నారా? లేదా? అనే విషయం నాకు తెలియదు. అదృశ్య జ్ఞానం కలిగిన అల్లాహ్‌కే అది బాగా తెలుసు. లేదా మీ వ్యక్తిగత వ్యవహారాలను బాగా తెలిసిన వారికి తెలిసి ఉండవచ్చు. పరీక్ష సమయంలో సత్యవంతుడిగా నిలిచి, ఎలాంటి పరిస్థితుల్లోనూ సత్యాన్ని విడిచిపెట్టని వ్యక్తికే 'సత్యవంతుడు' అనే ముద్ర లభిస్తుంది. ఆ ముద్ర మీ వద్ద ఉంటే, ముందుకు వచ్చి దానిని చూపించండి. లేకపోతే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌కు భయపడండి; ఆయన మీ లోపాలను బహిర్గతం చేయకముందే జాగ్రత్తపడండి."

**(ఆయినా కమాలాతే ఇస్లాం, రూహానీ ఖజాయిన్, సంపుటి 5, పుటలు 296-301)**

ప్రస్తావించబడిన ఆ కేసు విషయానికి వస్తే, ఆస్తి కూల్చివేతకు సంబంధించి మిర్జా సుల్తాన్ అహ్మద్ దాఖలు చేసిన దావా మరియు దాని వివరాల్లో, శంకర్ దాస్ అనే ఒక హిందూ డిప్యూటీ జమ్మూ రాష్ట్రంలో ప్రభుత్వ పదవిని నిర్వహించినట్లు నమోదు చేయబడింది. ఖాదియాన్‌లో ఆయన మస్జిద్ అక్సా తూర్పు వైపున ఉన్న ఒక ఖాళీ స్థలాన్ని తన ఆధీనంలోకి తీసుకుని, దానిపై ఒక ఇంటిని నిర్మించాడు. ఆ భవనంలో తరువాత సదర్ అంజుమన్ అహ్మదియ్యా కార్యాలయాలు ఏర్పాటు చేయబడ్డాయి. మిర్జా సుల్తాన్ అహ్మద్ ఆ ఇంటిని కూల్చివేయాలని కోరుతూ ఒక దావా వేశారు. కాని, ఆ కేసు రూపకల్పనలో వాస్తవానికి విరుద్ధమైన ఒక వాదన చేర్చబడింది. దాని కారణంగా ఆ కేసు కొట్టివేయబడే పరిస్థితి ఏర్పడింది. అలా జరిగితే నష్టం కేవలం మిర్జా సుల్తాన్ అహ్మద్‌కే కాకుండా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారికీ కలిగేది. ఎందుకంటే ఆ భూమిపై ఉన్న యాజమాన్య హక్కులు కోల్పోయే ప్రమాదం ఉండేది. ఆ భూమి ప్రత్యర్థి అయిన శంకర్ దాస్‌కు చెందలేదు. అయినప్పటికీ, ఆ స్థలంపై అతని భౌతిక ఆధిపత్యం (కబ్జా) అనేది స్థిరంగా ఉన్నది వాస్తవం. అతను ఆ భూమి యజమాని కాకపోయినా, దానిని తన ఆధీనంలోకి తీసుకున్నాడు. అతని ప్రత్యర్థులు చట్టపరమైన మార్గాల ద్వారానో లేదా ప్రత్యక్ష పరోక్ష మార్గాల ద్వారానో, అదే ఆధిపత్యాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని ప్రయత్నించారు. అందువల్ల, వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారిని సాక్ష్యం ఇవ్వడానికి కోర్టుకు పిలిపించారు. వారు ఎంతటి తీవ్రమైన ప్రత్యర్థులైనా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు ఎప్పటికీ అసత్యం చెప్పరని వారికి బాగా తెలుసు. కావున హుజూర్ (అ) కోర్టులో ఆ స్థలాన్ని ప్రత్యర్థియే చాలా కాలంగా తన ఆధీనంలో ఉంచుకున్నట్లు నిజం చెబుతారని వారికి నమ్మకం ఉండేది. ప్రత్యర్థి పక్షం వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారిని సాక్షిగా పిలిపించారని రాజకుమారులైన మిర్జా సుల్తాన్ అహ్మద్,, గారు తెలుసుకున్నప్పుడు, వారు కూడా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు ఎన్నటికీ అబద్ధం చెప్పరని బాగా తెలుసుకున్నాడు. అందువల్ల, వారు ఆ కేసును పూర్తిగా ఉపసంహరించుకున్నారు.

**(హయాత్-ఎ-అహ్మద్, సంపుటి 2, భాగం 1, పుటలు 102-103) (అస్హాబే అహ్మద్, సంపుటి 6, పుట 42, అనుబంధం).**

ఏదేమైనా, ఆ ఎత్తైన, విశాలమైన భవనానికి సంబంధించిన చరిత్ర ఇదే. అది డిప్యూటీ శంకర్ దాస్ భవనంగా ప్రసిద్ధి చెందింది. ముందే పేర్కొన్నట్లుగా, అతను తీవ్రమైన మతోన్మాదం మరియు శత్రుత్వ భావాలు కలిగిన వ్యక్తి. అతని ఎత్తైన భవనం కారణంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి ఇంటి ఆవరణ పరిసరాలు బయటి వారికి స్పష్టంగా కనిపించే పరిస్థితి ఏర్పడింది. ఈ కారణం కూడా ఆ భవనంపై న్యాయపోరాటం చేయడానికి ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది. అంతేకాక, తన శత్రుత్వాన్ని మరింత ప్రదర్శించేందుకు, అతను తన ఇంటి ప్రవేశద్వారం వద్ద కూర్చొని, మస్జిద్ అక్సాకు నమాజ్ చేయడానికి వెళ్ళే, తిరిగి వచ్చే వారిని తిట్టడం తన నిత్యచర్యగా చేసుకున్నాడు. వారిని బాధపెట్టడానికి, వేధించడానికి సాధ్యమైన ప్రతి విధానాన్నీ అనుసరించేవాడు. అతని వేధింపులకు గురైన వారు తమ నాయకుడైన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి వద్దకు వచ్చి తమ బాధలను వినిపించినప్పుడు, వారు (అ) ఎంతో ధైర్యంతో, గంభీరమైన స్థిరత్వంతో వారిని ఓదార్చుతూ ఇలా చెప్పేవారు: సహనంతో ఉండండి; రాజసంబంధమైన శిభిరాన్ని ఎదిరించి ఎవరూ నిలబడలేరు. అతను తన స్వంత స్థావరాన్ని, తన స్వంత శిభిరాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. అయితే మా శిభిరం కూడా రాజ శిభిరమే. అది సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క శిభిరం. దానిని ఎదిరించి ఎవరూ నిలబడలేరు." ఆ తర్వాత, దీనిని చూడవలసిన విధిగా నిర్ణయించబడినవారు నిజంగానే చూశారు. వినవలసినవారు నిజంగానే విన్నారు. ఆ డిప్యూటీ సాహిబ్ యొక్క అభివృద్ధి చెందిన, సంపన్నమైన కుటుంబం క్రమంగా పతనమై నాశనమవడం ప్రారంభమైంది.

చివరికి, అనారోగ్యమో లేక మరేదైనా కారణమో వల్ల, అతనూ అక్కడి నుండి వెళ్లిపోయాడు. అనంతరం, అదే ఆస్తిని హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ కొనుగోలు చేశారు. 1932లో, అదే భవనంలో సదర్ అంజుమన్ అహ్మదియ్య కార్యాలయాలు స్థాపించబడ్డాయి. వాటిని హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ప్రారంభించారు. మొత్తానికి ఇది దైవశక్తి యొక్క ఒక గొప్ప ప్రత్యక్ష నిదర్శనం. తన అహంకారంలో, మస్జిద్‌కు వెళ్లే మార్గంలో తన ఇంటి ముందు నుంచి ఒక ఆరాధకుడు కూడా వెళ్లడానికి అనుమతించని ఆ వ్యక్తి పేరు, దేవుని ఆజ్ఞ ప్రకారం, నేడు పూర్తిగా అంతరించి పోయింది. అంతేకాక, ఆ ఇల్లు, ఆ ప్రాంతమంతా ఇప్పుడు మస్జిద్‌గా మారిపోయింది. ఎందుకంటే అది ఇప్పుడు మస్జిద్ అక్సా యొక్క భాగమైంది. **(తారీఖే అహ్మదియ్యత్, సంపుటి 2, పుట 215, సంపుటి 5, పుటలు 298-299) (హయాత్-ఎ-అహ్మద్, సంపుటి 5, భాగం 2, పుట 230) (అల్ ఫజల్ ఖాదియాన్, 3 మే 1932, పుట 5) ( ముజద్దిద్-ఎ-ఆజమ్, భాగం 1, పుట 38 అనుబంధం)**

ఇవి సత్యనిష్ఠ మరియు నిజాయితీ పునాదిపై నిలిచిన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇచ్చిన సాక్ష్యం యొక్క మహత్తరమైన శుభములు. హుజూర్ (అ) సత్యాన్ని ఎన్నడూ విడిచిపెట్టలేదు. కుటుంబ గౌరవం, ప్రతిష్ఠ, భూములు, ఆస్తులు కోల్పోయే ప్రమాదాన్ని కూడా వారు (అ) లెక్కచేయలేదు. అవన్నీయు వారు (అ) తన స్వహస్తాలతో త్యాగం చేసినట్లే అయింది. అయితే అల్లాహ్ ఆ త్యాగాన్ని ఎంతో గొప్పతనంతో, మహిమతో, ఆశీర్వాదంతో అంగీకరించాడు కాబట్టి, నేడు మినారతుల్ మసీహ్‌కు సమీపంలో అదే స్థలం ఏకేశ్వరుడైన అల్లాహ్ ఆరాధనకు అంకితమైన పవిత్ర ప్రార్థనా స్థలంగా వెలుగొందుతోంది.

ఈ కేసును నడిపించిన న్యాయవాది గురించి హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా పేర్కొన్నారు: 'ఆ రోజుల్లో, గుర్దాస్‌పూర్‌కు చెందిన న్యాయవాది షేఖ్ అలీ అహ్మద్ సాహిబ్, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తరఫున అనేక న్యాయ వ్యవహారాల్లో వాదించేవారు. ఆయన అహ్మదీ కాకపోయినా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వాగ్దానం చేసిన తరువాత వారి (అ) గారి పవిత్ర జీవనాన్ని చూసి వారి(అ) పట్ల ఎంతో గౌరవాన్ని కలిగి ఉండేవారు. ఒకసారి ఆయన హుజూర్ (అ)తో ఇలా అన్నారు. ' ఇతర సాక్షులు ఎవరు లేరు. పైగా ఈ లేఖ కూడా అదే అంశానికి సంబంధించినది (ఇంతకు ముందు పేర్కొన్న పోస్టల్ కేసుకు సంబంధించినది). కాబట్టి దానిని ప్రచురించిన ప్రకటనలో భాగంగా పరిగణించవచ్చు' అని అన్నారు. (హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ రజి ఇక్కడ పోస్టల్ కేసు విచారణ వివరాలను వివరిస్తున్నారు.) అందువల్ల, అసత్యాన్ని ఆశ్రయించకుండా, 'నేను ఒక ప్రకటనను మాత్రమే పంపాను, లేఖను పంపలేదు' అని చెప్పవచ్చని ఆయన సూచించారు. కానీ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అలాంటి మార్గాన్ని అనుసరించడానికి నిరాకరించి, 'అలా చేయడం సాధ్యం కాదు. ఇలాంటి సూక్ష్మమైన భేదాన్ని చూపించడం సత్యానికి విరుద్ధం అవుతుంది. నేను నిజంగానే దానిలో ఒక లేఖను ఉంచాను. అది ప్రచురణలో భాగమే అయినప్పటికీ, అది లేఖయే. కాబట్టి నేను లేఖను పంపానని చెబుతాను. నేను చేసిన పనిని ఎలా తిరస్కరించగలను?' అని అన్నారు. అనంతరం ఆయన న్యాయస్థానంలో హాజరైనప్పుడు, 'మీరు ఆ కవరులో ఏదైనా లేఖను ఉంచారా?' అని అడగగా, 'అవును' అని సమాధానమిచ్చారు. హుజూర్ (అ) గారి ఈ సత్యనిష్ఠత ఇతరులపై సహజంగానే ప్రభావం చూపింది. అయితే అంతకంటే గొప్పగా, అది న్యాయస్థానంపైనే ఎంతో గాఢమైన ప్రభావాన్ని చూపింది. ఫలితంగా, హుజూర్ (అ) నిర్దోషిగా విడుదల చేయబడ్డారు. న్యాయమూర్తి ఇలా వ్యాఖ్యానించారు: 'కేవలం ఒక సాంకేతిక తప్పిదం కోసం ఇంత సత్యవంతుడైన వ్యక్తిని శిక్షించలేము." **(ఖుత్బాత్-ఎ-మహ్మూద్, సంపుటి 17, పుట 543)**

ఈ పోస్టల్ కేసు మరియు దాని న్యాయవాది గురించి, హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ (రజి) ఇలా వ్రాస్తారు: "షేఖ్ అలీ అహ్మద్ సాహిబ్ స్వయంగా ఈ సంఘటనలను నాకు వివరించారు. (ఇది ఆ న్యాయవాది స్వయంగా హజ్రత్ షేఖ్ యాకూబ్ అలీ ఇర్ఫానీ సాహిబ్ (రజి) గారికి ఇచ్చిన వాంగ్మూలం.) ఆయన ఇలా చెప్పారు: 'ఈ కేసు చివరి సారిగా దినా నగర్ కోర్టులో విచారణకు వచ్చింది. మిర్జా సాహిబ్ ఆ ఉత్తరాన్ని పొట్లంలో తానే ఉంచినట్లు నిరాకరించాలని నేను ఎంతగానో ప్రయత్నించాను. నా దృష్టిలో, ఆ ఉత్తరం అదే పొట్లం నుండి స్వాధీనం చేసుకున్నట్లు ఎలాంటి ఆధారం లేదు. అలాగే దానికి సంబంధించిన ఎలాంటి సాక్ష్యం కూడా లేదు. మతపరమైన భేదాభిప్రాయాల కారణంగా లాలా రల్యా రామ్ ఇచ్చే సాక్ష్యాన్ని కూడా నమ్మదగినదిగా పరిగణించేవారు కాదు. అయినప్పటికీ, నేను ఎంత ఎక్కువగా ఒత్తిడి చేసినా, మిర్జా సాహిబ్ అంతకంతకూ నిరాకరించడానికి ఒప్పుకోలేదు. 'నేను పదేపదే హుజూర్ (అ)ను హెచ్చరించాను. ఈ కేసు ఫలితం అనుకూలంగా ఉండదని, అనవసరంగా ఒక గౌరవనీయమైన కుటుంబానికి క్రిమినల్ కేసులో శిక్షపడిన ముద్ర పడుతుందని. పరిస్థితులన్నీ తమకు వ్యతిరేకంగా మారుతున్నాయని కూడా చెప్పాను. అయినప్పటికీ,' అని ఆయన కొనసాగిస్తూ, 'హుజూర్ (అ) నా సలహాను అంగీకరించలేదు.' ఆయన ఇంకా ఇలా వివరించారు: 'నేను చాలా ఆందోళన చెందాను. నేను హుజూర్ (అ) తరఫు న్యాయవాదిగా ఉండి కేసు ఓడిపోతే, అది మా కుటుంబ ప్రతిష్ఠకు పెద్ద దెబ్బ అవుతుందని భావించాను. అందువల్ల, మిర్జా సాహిబ్ తాను ఎట్టి పరిస్థితుల్లోనూ నిరాకరించబోనని దృఢంగా ప్రకటించినప్పుడు, దానిని అవకాశంగా తీసుకుని కేసు నుండి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను. నేను వారితో, "మీరు నా న్యాయసలహాను అంగీకరించకపోతే, నేను ఇకపై మీ తరఫున వాదించలేను" అని చెప్పాను. అంతేగాకా మీకు శిక్ష పడుతుందని, అలాగే తన న్యాయ సలహాను పాటించనందునే ఆ నింద అంతా వారిపైనే పడుతుందని నేను భావించాను.' ఆ న్యాయవాదికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)కు శిక్ష తప్పకుండా పడుతుందనే పూర్తి నమ్మకం ఉండేది. అంతేకాక, అలా తీర్పు వెలువడితే, ప్రజలు ఈ న్యాయవాది కేసును సరిగా వాదించలేదని చెప్పుకుంటారు. అందువల్ల, తన ప్రతిష్ఠ దెబ్బతింటుందనే భయంతో, అసంతృప్తిని వ్యక్తం చేసి ఆయన కోర్టుకు హాజరుకాలేదు. ఆ తర్వాత కేసు ఆయన లేకుండానే కొనసాగింది. చివరగా ఆ న్యాయవాది ఇలా అన్నారు: 'నా ఆశ్చర్యానికి హద్దుల్లేవు, కేసు పూర్తిగా కొట్టి వేయబడింది. అప్పుడు నాకు ఎంతో పశ్చాత్తాపం కలిగింది. ఈ విజయంతో నాకు కూడా కొంత కీర్తి దక్కిఉండేదని గ్రహించాను. కానీ అప్పటికే ఆ అవకాశం చేజారి పోయింది.'

ఈ సంఘటనను వివరించేటప్పుడు షేఖ్ అలీ అహ్మద్ సాహిబ్, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి అచంచలమైన స్థైర్యాన్ని మరియు సత్యనిష్ఠతను ఎంతో ప్రశంసించే వారు. వారికి ఈ కుటుంబంతో తన చివరి శ్వాస వరకు సత్సంబంధాలు కొనసాగాయి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) సాధారణంగా న్యాయపరమైన విషయాల్లో వారి సలహానే తీసుకునేవారు మరియు వారిని ఎంతో గౌరవించేవారు.

**అహాదీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)*

**అహాదీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb*

**(హయాతే అహ్మద్, సంపుటి 1, భాగం 2, పుటలు 363-364)**

హ|జ్రత్ షేఖ్ నూర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలాంటి అనేక సంఘటనలను ప్రస్తావిస్తూ ఇలా వివరించారు: వారి తండ్రి మరియు పినతండ్రి తరచూ తమ గ్రామం మిర్జా సాహిబ్ జాగీర్ పరిధిలో ఉండేదని చెప్పేవారు. కొంతకాలం పాటు హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ.స.) తన తండ్రి ప్రతినిధిగా వ్యవహరించారు. ఆ సందర్భంలో వారు ఆయనతో కలిసి అనేకసార్లు న్యాయస్థానానికి వెళ్లారు. ప్రతి సందర్భంలోనూ, కేసులో తనకు నష్టం కలిగినా సరే, వారు (అ) ఎల్లప్పుడూ సత్యాన్నే అనుసరించేవారు. నిజానికి, వారు (అ) ఎప్పుడూ సత్యాన్ని విడిచిపెట్టలేదు. అసత్యాన్ని తన వద్దకు రానివ్వలేదు.

**(సీరత్-ఎ-అహ్మద్, కుద్రతుల్లాహ్ సన్నోరీ సాహిబ్, పుట 63)**

హ|జ్రత్ మియాం అల్లాహ్ యార్ సాహిబ్ ఇలా వర్ణించారు: హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వయస్సు సుమారు 25 నుండి 30 సంవత్సరాల మధ్య ఉన్నప్పుడు, వారి గౌరవనీయ తండ్రికి తమ భూమిలో నివసిస్తూ పని చేసే రైతులతో చెట్లను నరికిన విషయమై వివాదం ఏర్పడింది. వారి తండ్రి అభిప్రాయం ఏమిటంటే, భూమికి యజమానులు తామే కాబట్టి, ఆ భూమిలోని చెట్లు కూడా తమకే చెందుతాయని. అందువల్ల వారు న్యాయస్థానంలో కేసు వేశారు మరియు ఆ కేసును కొనసాగించడానికి ఇద్దరు సాక్షులతో కలిసి హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను గుర్దాస్‌పూర్‌కు పంపించారు. మార్గ మధ్యంలో ఉన్న ఒక కాలువ దాటి సమీపంలోని పట్వావాలా అనే గ్రామానికి చేరుకున్న తర్వాత, వారు (అ) కొద్దిసేపు విశ్రాంతి తీసుకొని తనతో వచ్చిన వారితో ఇలా అన్నారు: "నా తండ్రి అనవసరంగా పట్టుబడుతున్నారు. చెట్లు కూడా పంటలాంటివే. వీరు పేదవారు. వారు వాటిని నరికివుంటే దానివల్ల ఏమి నష్టం ఉంది? ఏ పరిస్థితిలోనూ కోర్టులో అవి పూర్తిగా మావేనని నేను చెప్పలేను. ఎక్కువలో ఎక్కువ వాటిలో మాకు ఒక వాటా ఉందని మాత్రమే చెప్పగలను."

ఆ భూమిలో నివసిస్తూ పని చేసే రైతులకు వారిపై సంపూర్ణ విశ్వాసం ఉండేది. అందువల్ల మేజిస్ట్రేట్ ఆ విషయంలో వారిని (అనగా, అనేక తరాలుగా అక్కడ నివసిస్తున్న వారిని) ప్రశ్నించినప్పుడు, వారు ఎలాంటి సందేహం లేకుండా ఇలా సమాధానమిచ్చారు: "మీరు మిర్జా సాహిబ్‌ను అడగండి." వారు ఇలా కూడా అన్నారు: "హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను అడగండి; వారు ఎప్పుడూ అబద్ధం చెప్పరని మాకు తెలుసు."

అప్పుడు మేజిస్ట్రేట్ ఇదే ప్రశ్నను హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను అడిగినప్పుడు, వారు (అ) ఇలా సమాధానమిచ్చారు: "నా అభిప్రాయం ప్రకారం చెట్లు కూడా పంట లాంటివే. పంటలో మాకు పరస్పర అంగీకారంతో ఎలా వాటా ఉంటుందో, చెట్లలో కూడా అలాగే పరస్పర అంగీకారంతో వాటా ఉంటుంది." ఈ ప్రకటన అనంతరం, మేజిస్ట్రేట్ భూమిలో నివసిస్తూ పని చేసే రైతుల పక్షాన తీర్పు ఇచ్చారు.

హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఖాదియాన్‌కు తిరిగి వచ్చిన తరువాత, హ|జ్రత్ మిర్జా ఘులామ్ ముర్తజా సాహిబ్ వారితో కోర్టుకు వెళ్లిన వారిలో ఒకరిని కేసు ఫలితం గురించి అడిగారు. అతను ఇలా సమాధానమిచ్చాడు: "నేను కోర్టు బయట ఉన్నాను; మిర్జా సాహిబ్ లోపలికి వెళ్లారు. కాబట్టి జరిగినది వారికే తెలుసు." తరువాత హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను పిలిచినప్పుడు, జరిగిన సంఘటనను యథాతథంగా వివరించారు. అది విన్న వారి తండ్రి చాలా అసంతృప్తి వ్యక్తం చేశారు.

**(తారీఖే అహ్మదియ్యత్, సంపుటి 1, పుటలు 72-73 మరియు 78)**

ఏదేమైనా, ఇవి హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి సత్యనిష్ఠతను తెలియజేసే కొన్ని సంఘటనలు మాత్రమే. ఒక ప్రత్యేక సంఘటనను దారి తప్పిన ఒక మౌల్వీ చేసిన ఆరోపణకు సమాధానంగా విపులంగా వివరించారు. అన్ని పరిస్థితిలోనూ హ|జ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సత్యానికే ప్రాధాన్యత ఇచ్చేవారు. అసత్యం వైపు ఎప్పుడూ మొగ్గుచూపలేదు. వారు (అ) తన అనుచరులను ఎల్లప్పుడూ సత్యవంతులుగా ఉండమని ఉపదేశించారు. అంతేకాక, బైఅత్ యొక్క షరతులలో ఒకటి అబద్ధాన్ని అసహ్యించుకోవడం మరియు సత్యంపై దృఢంగా నిలిచి ఉండడం కూడ గలదు. **(మజ్మూఅహ్-ఎ-ఇష్తిహారాత్, 2019, సంపుటి 1, పుట 206)**

అందువల్ల, సత్యవంతంను మన వ్యక్తిత్వానికి ప్రత్యేక లక్షణంగా అలవరచుకోవడం మనందరి బాధ్యత. అల్లాహ్ తాలా మనకు అట్టి సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. ఆమీన్.

**(9వ పేజి తరువాత చదవండి)**

ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంపై హ|జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారు పంపిన దరూద్‌తో ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను. హుజూర్ (అ) ఇలా పేర్కొన్నారు:

"అత్యంత పరిపూర్ణుడైన మనిషి, సంపూర్ణ మానవుడు, సంపూర్ణ ప్రవక్త మరియు సంపూర్ణ ఆశీర్వాదాలతో వచ్చినవారు. వారి ఆధ్యాత్మిక పునరుద్ధరణ మరియు పునరుత్థానం కారణంగా ప్రపంచంలో మొదటి ఖియామత్ (ఆధ్యాత్మిక మేల్కొలుపు) ప్రత్యక్షమైంది. వారి రాకతో ఒక మృత ప్రపంచం జీవం పొందింది. ఆ మహిమాన్విత ప్రవక్త, ఖాతముల్ అంబియా (ప్రవక్తల ముద్ర), ఇమాముల్ అస్ఫియా (పవిత్రుల నాయకుడు), ఖాతముల్ ముర్సలీన్ (ప్రవక్తలలో చివరివారు), ఫఖరుల్ అంబియా (ప్రవక్తల గర్వకారణం) అయిన హ|జ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంల వారే. ఓ నా ప్రియమైన అల్లాహ్! ఈ ప్రియమైన ప్రవక్త (స)పై నీవు ప్రపంచ ఆరంభం నుండి మరెవరిపైనా పంపని విధమైన కరుణ మరియు దరూద్‌ను పంపుము.

**అల్లాహుమ్మ సల్లి వ సల్లిం వ బారిక్ అలైహి వ ఆలి హీ వ అస్‌హాబిహీ అజ్మయీన్. వ ఆఖిరుద్దావాన అనిల్ హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్."**

**(ఇత్మాముల్ హుజ్జత్, రూహానీ ఖజాయిన్, సంపుటి 8, పుట 308)**

ఓ ప్రభూ! నీ ప్రవక్తపై ఎల్లప్పుడూ దరూద్‌ను పంపుము,
ఈ ప్రపంచంలోనూ మరియు రెండవ ఆవిర్భావంలోనూ.
ఆమీన్.

---

**(12వ పేజి తరువాత చదవండి)** అలాగే విదేశాల నుండి వ్యక్తులు వచ్చి ఇక్కడ వ్యవసాయం చేయడానికి దేశ చట్టాలు మరియు ఇమ్మిగ్రేషన్ చట్టాల ప్రకారం అనుమతి ఉందా? లేదా? అనే విషయాన్ని కూడా కమిటీ పరిశీలించాలి. అనుమతి ఉన్నచో అందుకు నియమ నిబంధనలు ఏమిటి?, ఏ షరతులు ఉన్నాయి?, వీసా మొదలైనవి లభిస్తాయా? లేదా? అనే విషయాలను తెలుసుకోవాలి.

**హుజూర్ అన్వర్ గారి సేవలో ఇలా విన్నవించబడింది:** సిడ్నీలో మాకు నాలుగు జమాఅత్‌లు ఉన్నాయి. ఇప్పుడు మాకు రెండవ మసీదు నిర్మించాల్సిన అవసరం ఉంది. దీనిపై హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు: సిడ్నీలో రెండవ మసీదును నిర్మించండి. అది చాలా పెద్దదిగా ఉండవలసిన అవసరం లేదు. మీ మజ్లిస్ ఆమిలాలో చర్చించి నిర్ణయం తీసుకోండి.

ఆస్ట్రేలియాలో కూడా ఒక జామియా స్థాపించాలని, అలాగే దక్షిణ పసిఫిక్ దేశాల నుండి విద్యార్థులు ఇక్కడికి రావచ్చని ఒక ప్రతిపాదన హుజూర్ అన్వర్ గారి ముందు ఉంచబడింది. ఈ ప్రతిపాదనపై హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు: మొత్తం విషయాన్ని పరిశీలించి ఒక సాధ్యాసాధ్యత నివేదిక తయారు చేసి పంపండి.

అదే విధముగా జామియాకు వెళ్లాలని కోరుకునే వక్ఫే నౌ విద్యార్థులు ఎంతమంది ఉన్నారో కూడా పరిశీలించండి. ప్రతి సంవత్సరం ఎంతమంది ప్రవేశం పొందుతారు? ఇద్దరు ముగ్గురు మాత్రమే ఉంటే ఈ ప్రణాళిక సాధ్యపడదు. తరువాత జామియాకు భవనం అవసరం ఉంటుంది. హాస్టల్ అవసరం ఉంటుంది. వార్షిక బడ్జెట్ ఉంటుంది, ఖర్చులు ఉంటాయి. ఆ తరువాత ఉపాధ్యాయులను సమకూర్చాలి. ఉపాధ్యాయులకు వీసాలు లభిస్తాయా? ఉపాధ్యాయుల నివాసానికి స్థలం కూడా ఏర్పాటు చేయాలి. అలాగే దేశ చట్టాలు ఒక ప్రైవేట్ మత సంస్థను స్థాపించడానికి అనుమతిస్తాయా? లేదా? అనే విషయాన్ని కూడా పరిశీలించాలి. దానికి సంబంధించిన చట్టాలు మరియు షరతులు ఏమిటో తెలుసుకోవాలి. పసిఫిక్ దేశాల నుండి ఇక్కడికి వచ్చే విద్యార్థులకు వీసాలు లభిస్తాయా?, వారు ఇక్కడ ఎక్కువ కాలం ఉండగలరా? అనే విషయాన్ని కూడా పరిశీలించాలి.

**హుజూర్ అన్వర్ గారు ఇలా తెలిపారు:** ఈ విషయాలన్నింటిని లోతుగా పరిశీలించడం అవసరం. ఒక సంపూర్ణ సమగ్ర సాధ్యాసాధ్యత నివేదిక తయారు చేసి పంపండి.

ఆస్ట్రేలియా నేషనల్ మజ్లిస్ ఆమిలా హుజూర్ అన్వర్ గారితో జరిగిన ఈ సమావేశం రాత్రి 8 గంటల 50 నిమిషాలకు ముగిసింది. సమావేశం చివరలో హుజూర్ అన్వర్ గారు కరుణతో ఆమిలా సభ్యులందరికీ పెన్నులను బహుమతిగా ఇచ్చారు. అలాగే ఆమిలా సభ్యులు హుజూర్ అన్వర్ గారితో గ్రూప్ ఫోటో దిగే భాగ్యాన్ని కూడా పొందారు.

తదనంతరం రాత్రి 9 గంటలకు హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) మస్జిద్ బైతుల్ హుదాలో మఘ్రిబ్ మరియు ఇషా నమాజులను కలిపి చదివించేశారు. నమాజుల అనంతరం హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) తన నివాసానికి తిరిగి వెళ్లారు. **(మిగతా భాగం తరువాత)**

| **వర్తమాన ఖలీఫా వాక్యములు** | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్లె ఆందోళన కూడ దూరం కాదు."** **(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |
| --- | --- |

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*




# దైవ ప్రవక్త (స) వారి శుభప్రదమైన జీవనం: మానవ జీవన అభివృద్ధి, అనుసరణకు ఆదర్శం.

(షేక్ ముహమ్మద్ జకరియ్యా సాహెబ్, మురబ్బీ సిల్‌సిలా నజారత్ నష్ర్ వ ఇషాఅత్ ఖాదియాన్.)

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం

لَقَدْ كَانَ لَكُمْ فِيْ رَسُوْلِ اللهِ اُسْوَةٌ حَسَنَةٌ لِّمَنْ كَانَ يَرْجُوا اللهَ وَالْيَوْمَ الْاٰخِرَ وَذَكَرَ اللهَ كَثِيْرًا

అనువాదం: నిశ్చయముగా మీ కొరకు (అనగా) అల్లాహ్‌ను, పరలోక దినమును నమ్ముచు అల్లాహ్‌ను తరుచుగా స్తుతించు ప్రతివాని కొరకు అల్లాహ్ ప్రవక్తలో మంచి ఆదర్శమున్నది. (అహ్‌జాబ్ :22)

بلغ العلےٰ بکمالہ　　کشف الدجےٰ بجمالہ

حسنت جمیع خصالہ　　صلوا علیہ وآلہ

ప్రియమైన పాఠకులారా!

పైన పేర్కొన్న సూక్తి ద్వారా స్పష్టమవుతున్న విషయం ఏమిటినగా, మానవ జీవితంలోని అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి ప్రవక్త ముహమ్మద్ (స)వారి ఆదర్శ జీవితం మరియు వారు చూపిన మార్గం యుగాంతం వరకు సమస్త మానవాళికి ఏకైక, సమానమైన మార్గదర్శక సూత్రంగా నిలుస్తుంది. వారు సమస్త సద్గుణాలలో అత్యున్నతులు, శ్రేష్ఠులు మరియు సంపూర్ణులు. వారు (స) స్వయంగా ఇలా ప్రకటించారు: 'బుఇస్తు లి అత్‌మిమ్మ మకారిముల్ అఖ్‌లాక్' అనగా "ఉన్నతమైన నైతిక విలువలను తిరిగి స్థాపించి, వాటిని సంపూర్ణం చేయడానికి నేను పంపబడ్డాను." మరియు వారు (స) ఈ బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తించారు. ఖుర్‌ఆన్‌లో కూడా ఇలా పేర్కొనబడింది: "ఇన్నక లఅలా ఖులుఖిన్ అజీమ్" అనగా, నిశ్చయంగా మీరు గొప్ప సద్గుణ స్వభావంపై ఉన్నారు.

ప్రవక్త ముహమ్మద్ (స)వారి ఆదర్శ జీవితం ఆధ్యాత్మిక, నైతిక, ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి సమతుల్యమైన, శాశ్వతమైన ఉదాహరణ. ఇది వ్యక్తి సంస్కరణ నుండి ప్రపంచ సంక్షేమం వరకు అన్ని మానవ అవసరాలను తీర్చగల సమగ్ర విధానాన్ని అందిస్తుంది. ఇది న్యాయం, సమానత్వం మరియు మితభావంపై ఆధారపడిన ఆదర్శ జీవన వ్యవస్థను ప్రతిపాదిస్తుంది.

మరో మాటలో చెప్పాలంటే, ప్రవక్త (స) వారి ఆదర్శ జీవనం మానవ అభివృద్ధికి ఒక సమగ్ర, విశ్వవ్యాప్త మరియు శాశ్వత ఉదాహరణ. ఇది భౌతికత మరియు ఆధ్యాత్మికతను సమన్వయం చేసి సమతుల్యతను నెలకొల్పుతుంది. ఈ ఉదాహరణ, వ్యక్తి యొక్క అంతర్గత సంస్కరణ నుండి సామాజిక మరియు ఆర్థిక అభివృద్ధి వరకు జీవితంలోని ప్రతి రంగంలో మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది.

గౌరవనీయులారా!

మానవ అభివృద్ధి అంతర్గత పవిత్రతతో ప్రారంభమవుతుంది. దైవ ప్రవక్త (స) ఉన్నతమైన నైతిక విలువలు, నిజాయితీ మరియు సత్యవంతమైన ప్రవర్తనను సమాజానికి పునాదిగా చేశారు. తద్వారా శాంతియుతమైన మరియు స్థిరమైన సమాజం ఏర్పడుతుంది. అనగా, వ్యక్తిత్వ నిర్మాణం మరియు నైతిక విలువలు అత్యంత అవసరం. మానవ అభివృద్ధి పునాది సత్ప్రవర్తన మరియు సద్గుణాలపై నిర్మించబడింది. ఉస్వా-ఎ-హసనా మనకు సత్యం, విశ్వసనీయత, క్షమ, సహనం మరియు వాగ్దాన పరిరక్షణ లేకుండా ఏ సమాజమూ స్థిరంగా ఉండలేదని బోధిస్తుంది. ఈ నైతిక విలువలు ప్రతి యుగంలో మరియు ప్రతి సమాజంలో సమానంగా అనుసరించదగినవి.

ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థలో సంపద యొక్క న్యాయమైన పంపిణీ, జకాత్ మరియు వ్యాపారంలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇది పేదలు మరియు అవసరమైన వారి హక్కులను రక్షించి ఆర్థిక స్థిరత్వాన్ని కల్పిస్తుంది. అనగా, న్యాయమైన ఆర్థిక వ్యవస్థ మరియు ప్రజా సంక్షేమం కోసం ఉస్వా-ఎ-నబవి ఆర్థిక విధానానికి కేంద్ర బిందువు సంపద యొక్క సముచిత పంపిణీ, వ్యాపారంలో నిజాయితీ, వడ్డీ రహిత సమాజం మరియు కార్మికుల హక్కుల పరిరక్షణ.

ప్రవక్త (స) మదీనా రాజ్యంలో జకాత్, సదఖాలు మరియు వక్ఫ్ వ్యవస్థల ద్వారా ఒక సంక్షేమ సమాజాన్ని స్థాపించారు. ఇది నేటి ఆధునిక ఆర్థిక వ్యవస్థలకు కూడా ఒక ఉత్తమ నమూనాగా నిలుస్తుంది. ఖుత్బా-ఎ-హజ్జతుల్ విదా మానవ సమానత్వానికి ఒక విశ్వవ్యాప్త ప్రకటన. అందులో జాతి, వర్ణం, రంగు లేదా స్థాయి ఆధారంగా ఎలాంటి వివక్ష లేకుండా సమస్త మానవులకు సమాన గౌరవం ఇవ్వబడింది. అనగా, న్యాయం, సమానత్వం మరియు మానవ హక్కుల గురించి నేటి ప్రపంచం ప్రతిపాదిస్తున్న సూత్రాలకు శతాబ్దాల క్రితమే ఉస్వా-ఎ-నబవి ఆచరణాత్మక మరియు సంపూర్ణ నమూనాను అందించింది. ఖుత్బా-ఎ-హజ్జతుల్ విదా ద్వారా ప్రవక్త (స) రంగు, వంశం మరియు కుల భేదాలను తొలగించి మొత్తం మానవాళికి సమాన స్థానం కల్పించారు. ఇది సుస్థిరమైన సామాజిక అభివృద్ధికి ప్రాథమిక అవసరం.

బలమైన కుటుంబ వ్యవస్థకు, సామాజిక అభివృద్ధికి మూలాధారం. ప్రవక్త (స) బోధనలు కుటుంబ సంబంధాలు, తల్లిదండ్రుల హక్కులు మరియు పరస్పర గౌరవాన్ని ప్రోత్సహిస్తాయి. ప్రవక్త (స) నీటిని వృథా చేయడాన్ని నిషేధించారు, చెట్లు నాటాలని ప్రోత్సహించారు మరియు జీవితంలోని ప్రతి రంగంలో మితభావం, సమతుల్యతను పాటించాలని బోధించారు. ఇది ఆధునిక శాశ్వత అభివృద్ధి యొక్క ప్రధాన సూత్రాలలో ఒకటి. పర్యావరణ పరిరక్షణ, వనరుల దుర్వినియోగాన్ని నివారించడం, నీటి వినియోగం, వృక్షారోపణ మరియు జంతువుల హక్కుల గురించి సమగ్ర మార్గదర్శకాలు ఇవ్వబడ్డాయి. నేటి శాశ్వత అభివృద్ధి నమూనా కూడా పర్యావరణ పరిరక్షణ మరియు వనరుల పొదుపుపై దృష్టి పెడుతుంది. దీనికి స్పష్టమైన ఉదాహరణ పవిత్ర సీరత్-ఎ-తయ్యిబాలో కనిపిస్తుంది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, ప్రవక్త ముహమ్మద్ (స) వారి సంపూర్ణ నైతిక మహోన్నతతను వివరిస్తూ ఇలా పేర్కొన్నారు:

"బుద్ధి చాతుర్యం, వేగవంతమైన అవగాహన, స్వచ్ఛమైన మనస్సు, మంచి జ్ఞాపకశక్తి, పవిత్రత, సిగ్గు, సహనం, సంతృప్తి, వైరాగ్యం, భయభక్తులు, ధైర్యం, స్థిరత్వం, న్యాయం, విశ్వసనీయత, సత్యవంతమైన మాట, ఉదారత, దయ, మర్యాద, ధైర్యం, ఉన్నత ఆశయం, క్షమ, సహనం, గౌరవభావం, వినయం, మర్యాద, ప్రేమ, కరుణ, దాతృత్వం, దైవభీతి, దైవ ప్రేమ, అల్లాహ్‌తో సాన్నిహిత్యం, అల్లాహ్ వైపు సంపూర్ణంగా మళ్లడం మొదలైన సమస్త ఉత్తమ గుణాలు ఈ నిర్దోష ప్రవక్త (స) లో ఎంతో సమతుల్యతతో, సౌందర్యం మరియు ప్రకాశంతో నిండి ఉన్నాయి కాబట్టి, దైవిక ప్రకటనకు ముందే అవి స్వయంగా వెలుగొందడానికి సిద్ధంగా ఉండేవి. ఆ దివ్య కాంతులపై మరొక ఆకాశీయ కాంతి అయిన దైవ వహీ అవతరించింది. ఆ కాంతి వచ్చిన తరువాత, ఖాతమున్నబియ్యీన్ యొక్క పవిత్ర సత్తా సమస్త కాంతుల సమాహారంగా మారింది.

**(బరాహీన్-ఎ-అహ్మదీయా, రూహానీ ఖజాయిన్, మొదటి సంపుటి, పుట 195, హాషియా 11)**

محمدؐ عربی بادشاہ ہر دوسرا　　کرے ہے روح قدس جس کے در کی دربانی

اسے خدا تو نہیں کہہ سکوں پہ کہتا ہوں　　کہ اس کی مرتبہ دانی میں ہے خدادانی

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) గారు ఇలా పేర్కొన్నారు:

ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవిత చరిత్ర మరియు వారి ఆదర్శ జీవన విధానంను గురించి చెప్పడం అనేది ముగింపు లేని అంశం. ప్రతి సద్గుణంలోనూ మీకు ఒక గొప్ప ఆదర్శం కనిపిస్తుంది. అది ఎందుకు ఉండకూడదు? వారు (స) ఒక మహోన్నత గురువు, నైతిక విలువలను బోధించే గురువు. చెడ్డ స్వభావం కలవారు ఎవరైనా కూడ ప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు, ప్రవక్త (స) వారితో కూడా ఉత్తమమైన నైతికతతో ప్రవర్తించేవారు. అందువల్ల హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఇలా వర్ణించారు: ఒక వ్యక్తి ప్రవక్త మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి వద్దకు రావడానికి అనుమతి కోరాడు. అతన్ని చూసి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఇతను తన కుటుంబంలో చాలా చెడ్డ సోదరుడు." అనగా తన సోదరుడితో మంచిగా ప్రవర్తించడు. అలాగే తన కుటుంబంలో చెడ్డ కుమారుడు. అతను వచ్చి కూర్చున్న తర్వాత, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో విశాల హృదయంతో అతనితో చాలా మర్యాదగా, సౌమ్యంగా మాట్లాడారు. అతను చెడ్డ సోదరుడైనా, చెడ్డ కుమారుడైనా, చెడు అలవాట్లు కలిగి ఉన్నప్పటికీ, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో ఎంతో మంచిగా సంభాషించారు. అతను వెళ్లిపోయిన తర్వాత హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) అడిగారు: "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్తా! మీరు అతన్ని చూసినప్పుడు అతని గురించి ఇలా ఇలా అన్నారు. కానీ అతనితో మాట్లాడేటప్పుడు మీరు ఎంతో సంతోషంగా, చిరునవ్వుతో, మంచి స్వభావంతో ప్రవర్తించారు." అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: "ఓ ఆయిషా! నేను ఎప్పుడైనా దుర్భాషలు మాట్లాడటం నీవు చూశావా? నిశ్చయంగా, ప్రళయ దినాన అల్లాహ్ దృష్టిలో అత్యంత చెడ్డ వ్యక్తి ఎవరో తెలుసా? అతని చెడు ప్రవర్తనకు భయపడి ప్రజలు అతన్ని కలవడం మానుకునే వ్యక్తి."

(సహీ బుఖారీ, కితాబుల్ అదబ్, అధ్యాయం: ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అసభ్యంగా లేదా దురుసుగా మాట్లాడేవారు కాదు, హదీస్ 6032)

(జుమా ఖుత్బా, 1 డిసెంబర్ 2017)

حسینان عالم ہوئے شرمگیں　　جو دیکھا وہ حسن اور وہ نور جبیں

پھر اس وہ اخلاق اکمل تریں　　کہ دشمن بھی کہنے لگے آفریں

زہے خلق کامل، زہے حسن تام　　علیك الصلوة علیك السلام

మరలా ఇలా కూడా తెలిపారు:

"ఒక గొప్ప సద్గుణం వినయం మరియు నమ్రత. లేదా ఇలా చెప్పవచ్చు: వినయం మరియు నమ్రతలో కూడా ప్రవక్త (స) వారి స్వభావం అత్యున్నత స్థాయికి చేరుకుంది. ప్రవక్త (స) వారి వినయం మరియు నమ్రత గురించి హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఇలా వివరించారు: సహాబాలలో ఎవరో, లేదా అహ్లే బైఅత్ సభ్యులలో ఎవరో, లేదా ఇంటి వారిలో ఎవరో ప్రవక్త (స)ను పిలిచినప్పుడు, ప్రవక్త (స) వారికి 'లబ్బైక్' (నేను సిద్ధంగా ఉన్నాను) అని సమాధానం ఇవ్వకుండా ఎప్పుడూ ఉండలేదు." హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఇలా అన్నారు: "అందుకే పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఇలా ప్రకటించాడు: "ఇన్నక ల అలా ఖులుఖిన్ అజీమ్" అనగా 'నిశ్చయంగా నీవు మహోన్నతమైన స్వభావంను కల్గి ఉన్నావు.' (అల్-ఖలం: 5)

**(తఫ్సీర్ దుర్రుల్ మన్సూర్, సంపుటి 8, పుట 226, సూర ఖలం, సూక్తి: ఇన్నక లఅలా ఖులుఖిన్ అజీమ్)**

محبت سے گھائل کیا آپ نے　　دلائل سے قائل کیا آپ نے

جہالت کو زائل کیا آپ نے　　شریعت کو کامل کیا آپ نے

بیاں کر دیئے سب حلال و حرام　　عَلَيكَ الصَّلٰوةُ عَلَيكَ السَّلام

ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అనుసరణ మరియు విధేయత గురించి ఆదేశిస్తూ అల్లాహ్ తఆలా ఇలా ప్రకటిస్తున్నాడు:

'وَمَآ اٰتٰكُمُ الرَّسُوْلُ فَخُذُوْهُ ۗ وَمَا نَهٰكُمْ عَنْهُ فَانْتَهُوْا ۚ وَاتَّقُوا اللّٰهَ ۗ اِنَّ اللّٰهَ شَدِيْدُ الْعِقَابِ"

అనగా: ప్రవక్త మీకు నొసంగిన దానితో మీరు తృప్తిపడుడు. మిమ్ములను ఆపు దాని నుండి మీరు దూరముండుడు. అల్లాహ్‌కు భయపడడు. నిశ్చయముగా అల్లాహ్ శిక్షించుటలో చాలా కఠినుడు. (హష్ర్: 8)

'قُلْ اِنْ كُنْتُمْ تُحِبُّوْنَ اللّٰهَ فَاتَّبِعُوْنِيْ يُحْبِبْكُمُ اللّٰهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوْبَكُمْ ۗ وَاللّٰهُ غَفُوْرٌ رَّحِيْمٌ '

అనగా: మీకు అల్లాహ్ పట్ల ప్రేమ ఉన్నచో, నన్ను అనుసరింపుడు. అప్పుడు అల్లాహ్ మిమ్ములను ప్రేమించును. మీరు చేసిన దోషములను క్షమించును. అల్లాహ్ క్షమాగుణ ప్రపూర్ణుడు. పరమ కారుణ్యమూర్తి అని వారితో చెప్పుము.

**(ఆలే ఇమ్రాన్:32)**

హజ్రత్ మసీహ్ మౌద్ అలైహిస్సలాం ఇలా సెలవిచ్చారు:

"మీరు అల్లాహ్ తఆలాను ప్రేమిస్తే, నన్ను అనుసరించండి. ఈ అనుసరణ ఫలితంగా అల్లాహ్ తఆలా మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు." మరల ఇలా తెలిపారు: 'కాబట్టి ఈ సూక్తి ద్వారా స్పష్టంగా నిరూపితమవుతోంది ఏమిటనగా, మనిషి సంపూర్ణంగా ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క అనుచరుడిగా మారనంత వరకు, అతను అల్లాహ్ తఆలా యొక్క అనుగ్రహాలు మరియు శుభాలను పొందలేడు. అలాగే అతని పాపపూరిత జీవితం మరియు మనోవాంచల అగ్నిని చల్లార్చగల ఆధ్యాత్మిక జ్ఞానం మరియు అంతర్దృష్టి అతనికి ప్రసాదించబడదు. అలాంటి వారే 'ఉలమాఉ ఉమ్మతీ' (నా ఉమ్మత్‌లోని పండితులు) అనే భావనలోకి వస్తారు."

**(మల్ఫూజాత్, సంపుటి 8, పుటలు 96-97, 1985 ఎడిషన్, ప్రచురణ: ఇంగ్లాండ్)**

దీనివల్ల తెలిసేది ఏమిటనగా, నిజమైన విజయవంతమైన జీవితం మరియు ఉన్నతమైన అభివృద్ధి స్థాయిలకు తీసుకువెళ్లే జీవితం అనేది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి అడుగుజాడలను అనుసరించే జీవితమే.

మనం జీవించడం, మరణించడం, నిద్రించడం, మేల్కొనడం అన్నీ హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం చూపిన మార్గానికి అనుగుణంగా మారినప్పుడే, మన ప్రతి పని ఇబాదత్‌గా మారుతుంది. మరియు అభివృద్ధికి సుస్థిరమైన ఆదర్శ వంతమైన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి పవిత్ర నడవడిను అనుస రించడం వలనే, మనం అభివృద్ధి మార్గంలో నిరంతరం ముందుకు సాగుతూ ఉంటాము. ముస్లింలలో ఈ రసూల్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క అనుసరణ లోపించడం వల్లనే వారు అల్లాహ్‌కు దూరమై, ఆయన కృపలకు దూరంగా ఉన్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ పరిస్థితిని ఇలా వివరించారు:

"ముస్లింలలో అంతర్గత విభేదాలకు కారణం కూడా ఇదే. అనగా ప్రాపంచిక ప్రేమ. ఎందుకంటే కేవలం అల్లాహ్ తఆలా యొక్క సంతృప్తి మాత్రమే ప్రధాన మైనదిగా ఉన్నప్పుడే ఏ వర్గం యొక్క సిద్ధాంతాలు స్పష్టంగా ఉన్నాయో అని సులభంగా అర్థం చేసుకుని, వాటిని స్వీకరించి అందరూ ఏకమయ్యేవారు. కానీ నేడు ఈ ప్రాపంచిక ప్రేమ కారణంగా ఈ చెడు పరిస్థితి ఏర్పడుతోంది. అలాంటి వారిని ముస్లింలు అని ఎలా పిలవగలం?. ఎందుకంటే వారి అడుగులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి అడుగు జాడలపై లేవు.

అల్లాహ్ తఆలా ఇలా చెప్పాడు: قُلْ اِنْ كُنْتُمْ تُحِبُّوْنَ اللّٰهَ فَاتَّبِعُوْنِيْ يُحْبِبْكُمُ اللّٰهُ

అనగా 'నీవు ఇట్లనుము. మీరు అల్లాహ్‌ను ప్రేమిస్తే, నన్ను అనుసరించండి. ఫలితముగా అల్లాహ్ కూడ మిమ్మల్ని ప్రేమిస్తాడు." మరల హుజూర్ (అ) ఇలా తెలిపారు: "నేడు అల్లాహ్ ప్రేమకు బదులుగా, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అనుసరణకు బదులుగా, ప్రపంచ ప్రేమకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ఇదేనా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క అనుసరణ?, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచాసక్తి కలవారా? (నవూజుబిల్లాహ్), వారు (స) వడ్డీ తీసుకునేవారా?, లేక వారు (స) అల్లాహ్ విధించిన బాధ్యతలు మరియు ఆదేశాలను నిర్వర్తించడంలో నిర్లక్ష్యం చేసేవారా?. ప్రవక్త (స) (అల్లాహ్ కాపాడుగాక)లో కపటం, రాజీ ధోరణి ఉండేదా? వారు (స) ప్రపంచానికి ధర్మంపై ప్రాధాన్యం ఇచ్చేవారా?. ఆలోచించండి! అనుసరణ అనగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అడుగు జాడలను అనుసరించడం. ఆ తర్వాత చూడండి. అల్లాహ్ తఆలా ఎలాంటి అనుగ్రహాలను ఏ విధముగా ప్రసాదిస్తాడో."

**(మల్ఫూజాత్, సంపుటి 8, పుటలు 348-349, 1985 ఎడిషన్, ప్రచురణ: ఇంగ్లాండ్)**

గౌరవనీయులైన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి సహచరులు (రిజ్వానుల్లాహ్)లు ప్రవక్త (స) వారి ఆదర్శమైన జీవన విధానాన్ని స్వీకరించి, అన్ని రకాల అభివృద్ధులు మరియు విజయాలను పొందారు.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఈ ఉన్నతమైన ప్రమాణాలు సహచరులలో ఎలాంటి విప్లవాత్మక మార్పును తీసుకువచ్చాయో వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"నేను చాలా బలంగా చెబుతున్నాను. అతను ఎంతటి కఠినమైన శత్రువైనా సరే, అతను క్రైస్తవుడైనా లేదా ఆర్యుడైనా సరే, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి రాకకు ముందు అరేబియాలో ఉన్న పరిస్థితులను చూసి, ఆ తర్వాత ప్రవక్త(స) వారి బోధనలు మరియు ప్రభావం వల్ల వచ్చిన మార్పును గమనించినచో, అతను తప్పనిసరిగా ప్రవక్త (స) సత్యతకు సాక్ష్యం ఇవ్వకుండా ఉండ లేదు. సాధారణమైన విషయం ఏమిటంటే, పవిత్ర ఖుర్ఆన్ వారి మొదటి స్థితిని ఈ విధంగా చిత్రీకరించింది: " **యఅకులూన కమా తఅకులుల్ అన్అమ్**" (ముహమ్మద్: 13) అనగా, వారు జంతువులు తినే విధంగా తినేవారు. వారి పరిస్థితి జంతువుల మాదిరిగా ఉండేది. ఇది వారి అవిశ్వాస స్థితి. ఆ తర్వాత ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి పవిత్రమైన ప్రభావాలు వారిలో మార్పును కలిగించినప్పుడు, వారి పరిస్థితి ఇలా మారింది: " **యబీతూన లి రబ్బిహిం సుజ్జదన్ వ ఖియామా**" (అల్-ఫుర్ఖాన్: 65) అనగా, వారు తమ ప్రభువు సమక్షంలో సాష్టాంగ నమస్కారాలు చేస్తూ, నిలబడి ప్రార్థనలు చేస్తూ రాత్రులను గడిపేవారు."

హజ్రత్ మసీహ్ మౌద్ అలైహిస్సలాం ఇలా అన్నారు:

"ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అరేబియాలోని ఆటవిక స్వభావం కలిగిన ప్రజలలో చేసిన మార్పు, వారిని ఏ గోతిలో నుండి బయటకు తీసి ఏ ఉన్నత స్థానం మరియు గౌరవానికి చేర్చారో, ఆ మొత్తం పరిస్థితిని చూసినప్పుడు, మనిషి ఆశ్చర్యంతో కన్నీళ్లు పెట్టుకోకుండా ఉండలేడు. ప్రవక్త (స) చేసినది ఎంత గొప్ప విప్లవమో!" మరల ఇలా తెలిపారు: "ప్రపంచంలోని ఏ చరిత్రలోనూ, ఏ జాతిలోనూ ఇందుకు సమానమైన ఉదాహరణ కనిపించదు. ఇది కేవలం ఒక కథ కాదు. ఇవి వాస్తవ సంఘటనలు. వీటి సత్యాన్ని ఒక యుగం మొత్తం అంగీకరించ వలసి వచ్చింది."

**(మల్ఫూజాత్, భాగం 9, పేజీలు 144-145, 1985 ఎడిషన్, ప్రచురణ: ఇంగ్లాండ్)**

صادفتهم قوم كروث ذلةً　　فجعلتهم كسبيكة العقيان

ప్రియ పాఠకులారా!

నేడు ఒక అహ్మదీ మాత్రమే, వర్తమాన ఖలీఫా, అమీర్ ఉల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారు చూపించిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి సువర్ణ సూత్రాలను మరియు ఉత్తమ ఆదర్శాలను అనుసరిస్తూ అభివృద్ధి యొక్క నూతన ఉన్నత శిఖరాలను చేరుకుంటున్నాడు మరియు చేరుకోవాలి.

ఈ విషయమై హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) ఇలా పేర్కొన్నారు: "కావున, అన్ని వేళలలోనూ మన ప్రవర్తనలను, నైతిక విలువలను మంచిగా ఉంచుకోవడం అవసరం. ఇదే నేడు ఒక అహ్మదీ యొక్క లక్షణం కావాలి. ఈ రోజు ముస్లింలలో ఉన్న కలహాలు, విభేదాలు, అశాంతికి ప్రధాన కారణం నైతిక ప్రమాణాలు పడిపోవడమే. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఆదర్శాన్ని ప్రజలు మరచిపోయారు. కేవలం మాటలతోనే వాదనలు చేస్తున్నారు....... కాబట్టి ఈ రోజు నిజమైన ఉత్సవాలను జరుపుకోవాలంటే, ప్రవక్త (స) వారి ఆదర్శాన్ని అనుసరించడం ద్వారా మాత్రమే జరుపుకోవచ్చు. అక్కడ ఆరాధనల ప్రమాణాలు కూడా ఉన్నతంగా ఉండాలి. ఏకేశ్వరవాదంపై సంపూర్ణ విశ్వాసం ఉండాలి. ఉన్నత నైతిక ప్రమాణాలు కూడా కలిగి ఉండాలి. ఇవి లేకపోతే మనకు మరియు ఇతరులకు మధ్య ఎలాంటి తేడా ఉండదు. ఒకవేళ మనము ఆచరించకపోయినచో, చెల్లా చెదురుగా ఉన్నవారు, తాత్కాలిక నాయకులు మరియు నామమాత్రపు మత పండితుల వెనుక నడుస్తూ ప్రజలకు కష్టాలను కలిగిస్తున్న వారికీ మనకీ ఎలాంటి తేడా ఉండదు. హజ్రత్ మసీహ్ మౌద్ అలైహిస్సలాం వారి బైఅత్ యొక్క అసలు లక్ష్యం కూడ ఇదే. అనగా ప్రతి విషయంలోనూ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి ఆదర్శాన్ని మన ముందుంచుకోవాలి. అల్లాహ్ మనందరికీ ఇందుకు అనుగుణంగా ఆచరించే సామర్థ్యాన్ని ప్రసాదించుగాక!" **(జుమా ప్రసంగం, 1 డిసెంబర్ 2017)**

**(7వ పేజీలో చదవండి)**

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

سیرت خاتم النبیین صلی اللہ علیہ وآلہ وسلم

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

### ఇస్లాం క్రైస్తవ మతం ప్రభావానికి గురిఅయ్యినదా?

ఈ సందర్భంలో సర్ విలియం ముయిర్ గారితో పాటు మరికొందరు ముస్లిమేతర చరిత్రకారులు బహీరా అనే సన్యాసి (రాహిబ్) సంఘటనను, అలాగే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవక్తుత్వాన్ని ప్రకటించక ముందు కొంత మంది క్రైస్తవులను కలిశారనే ఇతర సంఘటనలను ఆధారంగా చేసుకుని, ప్రవక్త (స) క్రైస్తవ మతం ప్రభావానికి లోనై ప్రవక్తత్వాన్ని ప్రకటించారని, వారి (స) బోధనలు కూడా అదే ప్రభావం ఫలితమని వాదించారు. అయితే ఈ అభిప్రాయం పూర్తిగా తప్పు, వాస్తవాలకు విరుద్ధమైనది. ప్రవక్త(స)గారి జీవిత చరిత్రను, వారి (స) బోధనలను కొంతైనా అధ్యయనం చేసినవారికి, నిష్పక్షపాత దృష్టి వారికి ఉన్నట్లయితే, అలాంటి వారు ఈ అరోపణ ఏమాత్రం నమ్మదగినది కాదని చెబుతారు. ప్రతి వివేకవంతుడు తన సామర్థ్యానికి అనుగుణంగా తన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశీలించడం సహజం. ఆ పరిశీలన కోణంతోనే మంచి, చెడులపై అభిప్రాయాలు ఏర్పడటం కూడా సహజమే. కాబట్టి, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవక్తుత్వానికి ముందు ఏదైనా క్రైస్తవుణ్ణి కలిసివుంటే, లేదా క్రైస్తవ మత బోధనలు వినే అవకాశం లభించి ఉంటే, వాటిలోని మంచి, చెడుల గురించి వారి (స) మనసులో అభిప్రాయాలు ఏర్పడి ఉండటం సహజమే. కానీ, వారి (స) ప్రవక్తత్వం మరియు వారి (స) బోధనలు అట్టి అభిప్రాయాల ఫలితమే అని చెప్పడం పూర్తిగా ఆధార రహితమైనది. ఎందుకంటే, మొదటిగా, ప్రవక్తుత్వానికి ముందు వారు (స) ఏ క్రైస్తవుణ్ణి అంత సన్నిహితంగా కలిశారనే నమ్మదగిన ఆధారం లేదు. అందువలన అలాంటి పరిచయం వారి (స) వ్యక్తిత్వంపై శాశ్వతమైన, లోతైన ప్రభావం చూపిందని చెప్పలేం. అలాగే, ఒకవేళ అలాంటి ప్రభావం ఉందని ఊహించినా, అది క్రైస్తవ మతాన్ని సమర్థించే ప్రభావం కాదని స్పష్టమవుతుంది. ఎందుకంటే, ప్రవక్త (స) గారు తీసుకువచ్చిన బోధనల్లో క్రైస్తవ మతంలోని ప్రధాన సిద్ధాంతాలతో గాఢమైన విభేదాలు కనిపిస్తాయి. ఉదాహరణకు, నేటి క్రైస్తవ మతం ప్రధానంగా యేసు దేవుడని, త్రిత్వ సిద్ధాంతం, మరియు ప్రాయశ్చిత్తం వంటి విశ్వాసాలపై ఆధారపడి ఉంది. కానీ ఖుర్ఆన్‌లో ఈ మూడు సిద్ధాంతాలను అత్యంత స్పష్టంగా మరియు గట్టిగా ఖండించడం జరిగింది. ముఖ్యంగా, యేసును దేవుని కుమారుడిగా లేదా దేవుడిగా భావించే విశ్వాసాన్ని ఖుర్ఆన్ తీవ్రంగా నిరాకరిస్తూ, అలాంటి నమ్మకం వల్ల భూమి, ఆకాశాలు చీలిపోయేంతటి ఘోరమైన ప్రమాదం ఉందని పేర్కొంటుంది. అలాంటి పరిస్థితుల్లో ఇస్లాం బోధనలను క్రైస్తవ మతం నుండి ఉద్భవించాయని చెప్పడం పూర్తిగా అసంబద్ధమైన, వివేకరహితమైన ప్రయత్నం మాత్రమే.

ఇక, ఖుర్ఆన్‌లో యేసు క్రీస్తు (ఈసా అలైహిస్సలాం)ను ప్రశంసించడం పై కూడా అభ్యంతరం చెప్పడానికి ఎలాంటి ఆధారంగా నిలవదు. ఎందుకంటే, ఖుర్ఆన్ ఆయనను దేవుని కుమారుడిగా లేదా దేవుడిగా కాకుండా, ఒక ప్రవక్తగా మాత్రమే గౌరవిస్తుంది. అంతేకాక, ఈ గౌరవం యేసుకే పరిమితం కాదు. ఖుర్ఆన్ గతంలోని ప్రవక్తలందరిని గొప్పవారిగా, గౌరవనీయులుగా ప్రశంసిస్తుంది. ఇంకా, ప్రపంచంలోని ప్రతి జాతిలోనూ దేవుడు తన ప్రవక్తలను పంపాడనే సూత్రాన్ని ఖుర్ఆన్ బలంగా ప్రతిపాదిస్తుంది. ఈ విధంగా, అన్ని జాతుల మహనీయుల పట్ల ముస్లింల హృదయాల్లో గౌరవాన్ని స్థాపిస్తుంది. అయితే, యేసు దైవత్వాన్ని మరియు క్రైస్తవ మతంలోని ఇతర ప్రధాన సిద్ధాంతాలను ఇస్లాం అత్యంత స్పష్టంగా తిరస్కరిస్తుంది. యేసును ఒక మానవ ప్రవక్తగా మాత్రమే పరిగణిస్తుంది. ఆయన కూడా ఇతర ప్రవక్తల మాదిరిగానే తన జీవితకాలాన్ని పూర్తిచేసి మరణించారని బోధిస్తుంది. అందువల్ల ఇస్లాం క్రైస్తవ మతం ప్రభావానికి లోనైందనే ఆరోపణ పూర్తిగా నిరాధారమైనది మరియు అసత్యమైనది అని అర్థమవుతుంది.

ఒకవేళ క్రైస్తవ మతంలోని కొన్ని ధార్మిక మరియు నైతిక బోధనలు ఇస్లాంలో కూడా కనిపిస్తాయని, అందువల్ల ఇస్లాం వాటిని క్రైస్తవ మతం నుండి స్వీకరించిందనే భావన కలగవచ్చని ఎవరైనా వాదించినా, అది కూడా పూర్తిగా నిరర్థకమైన అభ్యంతరమే అవుతుంది. ఎందుకనగా మొదటిగా, ఇస్లాం మరియు నేటి క్రైస్తవ మతం యొక్క అనేక ప్రాథమిక సిద్ధాంతాలు పరస్పరం పూర్తిగా భిన్నంగా ఉన్నప్పుడు, కొన్ని ఉపాంశాలలో రెండింటి బోధనల్లో పోలికలు ఉండటం వల్ల ఒకటి మరొకటి నుండి తీసుకోబడిందని నిర్ధారించడం ఏ విధంగానూ సమంజసం కాదు. రెండవది, ఇస్లాం ధర్మం, హజ్రత్ ఈసా (యేసు క్రీస్తు)ను దేవుడు ఎన్నుకోబడిన ప్రవక్తగా అంగీకరిస్తుంది మరియు తాను (ఇస్లాం) కూడా దేవుని నుండి వచ్చిన దైవిక మతమని ప్రకటిస్తుంది. కాబట్టి, ఒకే మూలం నుండి వచ్చిన కారణంగా ఇస్లాం మరియు క్రైస్తవ మతంలోని కొన్ని బోధనలు పరస్పరం సారూప్యంగా ఉండటం సహజమే. ఎందుకంటే, సత్యమార్గానికి సంబంధించిన మౌలిక సూత్రాలు అన్ని కాలాలలోను, అన్ని జాతులకూ ఒకే విధంగా ఉంటాయి. మూడవది, పవిత్ర ఖుర్ఆన్ స్వయంగా తాను గతంలోని అన్ని దైవగ్రంథాలలో ఉన్న శాశ్వత సత్యాలను తనలో సమీకరించిందని ప్రకటిస్తుంది. ఆ క్రమంలోనే ఇలా చెబుతుంది: “ **ఫీహా కుతుబున్ ఖయ్యిమా** ” అనగా గతంలోని అన్ని దైవగ్రంథాల స్థిరమైన, శాశ్వతమైన సత్యాలు ఖుర్ఆన్‌లో సమకూర్చబడ్డాయి.” కాబట్టి, ఈ దృష్టికోణంలో కూడా క్రైస్తవ మతానికి ఎలాంటి ప్రత్యేక ఆధిక్యం నిరూపించబడదు. ఇక్కడ మరో విషయం కూడా ప్రస్తావించదగినది. ఖుర్ఆన్ తనలో గత దైవబోధనలన్నింటి శాశ్వత సత్యాలను మరియు స్థిరమైన సిద్ధాంతాలను చేర్చుకున్న లక్షణాన్ని ఒక గొప్ప విశిష్టతగా చూపిస్తుంది. ఈ సందర్భంలో అది తనను తేనెటీగతో పోలుస్తుంది. తేనెటీగ అనేక రకాల పండ్లు, పూల నుండి వాటి సారాన్ని సేకరించి, అత్యంత సూక్ష్మమైన రసాయనిక ప్రక్రియ ద్వారా తేనెను తయారు చేస్తుంది. ఆ తేనె అనేక పూలు, పండ్ల సారంతో తయారైనప్పటికీ, అది పూర్తిగా ఒక కొత్త పదార్థంగా ఉంటుంది. దానిని ఏ ఒక్క పువ్వుకీ లేదా పండుకీ ప్రత్యేకంగా ఆపాదించలేము. అదేవిధంగా, ఖుర్ఆన్ కేవలం పూర్వ దైవగ్రంథాల నుండి వాటి స్థిరమైన బోధనలను మాత్రమే స్వీకరించలేదు. అది శాశ్వతమైన దైవశాసనాన్ని కలిగి ఉన్నందున, ప్రళయ దినం వరకు మానవ జాతికి అవసరమయ్యే అనేక కొత్త బోధనలను కూడా జోడించి, ఒక సంపూర్ణమైన మరియు శాశ్వతమైన ధర్మశాసనాన్ని అందించింది. దేవుడు అందులో అట్టి విశేష గుణాలను నిక్షిప్తం చేశాడు కాబట్టి, ఈ విశ్వంలో ప్రకృతి మానవుల భౌతిక అవసరాలను ఎలా తనలో దాచుకొని అవసరానుసారం వెలికితీస్తుందో, అలాగే ఖుర్ఆన్ కూడా మానవజాతి యొక్క ఆధ్యాత్మిక, ధార్మిక అవసరాలకు సంబంధించిన మార్గదర్శకత్వాన్ని ప్రళయదినం వరకు తనలో దాచుకొని, కాలానుగుణంగా వెల్లడిస్తూనే ఉంటుంది. వాస్తవానికి, పవిత్ర ఖుర్ఆన్ ఈ క్రింది బోధనల సమాహారం:

(1) పూర్వ దైవగ్రంథాలలో శాశ్వతమైన, విశ్వవ్యాప్త ధర్మశాసనంలో భాగమయ్యే బోధనలు.

(2) భవిష్యత్తులో ప్రపంచంలోని వివిధ జాతుల అవసరాలకు అనుగుణంగా, మానవుల పరస్పర హక్కులు (హుకూక్ అల్-ఇబాద్) మరియు దేవుని హక్కులు (హుకూక్ అల్లాహ్) సంపూర్ణంగా నెరవేర్చడానికి, అలాగే అన్ని రకాలైన నైతిక మరియు ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రళయదినం వరకు అవసరమైన శాశ్వత బోధనలు.

అందువల్ల, పవిత్ర ఖుర్ఆన్ లేదా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ప్రవక్తుత్వం క్రైస్తవ మతం లేదా మరో ఇతర మత బోధనల ఫలితమని భావించడం పూర్తిగా తప్పు మరియు ఆధార రహితమైన వాదన. అలాంటి అభిప్రాయాన్ని ఇస్లామీయ చరిత్ర, ఇస్లామీయ బోధనల గురించి పూర్తిగా అవగాహన లేని వ్యక్తి మాత్రమే వ్యక్త పరచగలడు. ముఖ్యంగా, ఇస్లామీయ బోధనలను బహీరా అనే సన్యాసి (రాహిబ్) వంటి వ్యక్తులతో జరిగిన సమావేశాలకు ఆపాదించడం అత్యంత హాస్యాస్పదమైన వాదన. వివేకవంతుడైన ఏ వ్యక్తీ అలాంటి మాట చెప్పడు.

### ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మేకలను మేపడం:-

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సిరియా ప్రయాణం నుండి తిరిగి వచ్చిన తరువాత కూడా తన పిన్నాన్న అబూ తాలిబ్ సంరక్షణలోనే నివసించే వారు. ఆ కాలంలో అరబ్బులలో చిన్నపిల్లలకు సాధారణంగా పశువులను మేపే పని అప్పగించేవారు. అందువల్ల ప్రవక్త (స) గారు కూడా అప్పుడప్పుడు ఈ పని చేస్తూ మేకలను మేపేవారు.

ప్రవక్తగా నియమించబడిన తరువాత వారు (స) ఇలా చెప్పేవారు: “మేకలను మేపడం కూడా ప్రవక్తల సంప్రదాయం (సున్నత్). నేను కూడా మేకలను మేపాను.” ఒకసారి ప్రయాణంలో ప్రవక్త (స) సహచరులు అడవిలో దొరికే పీలు (ఒక రకమైన అడవి పండు) పండ్లను సేకరించి తింటుండగా, ప్రవక్త (స)గారు ఇలా అన్నారు: “నల్లని పీలు పండ్లను వెతికి తినండి. ఎందుకంటే నేను మేకలను మేపిన రోజుల అనుభవం ప్రకారం, నల్లని పీలు పండ్లు మరింత రుచికరంగా, మంచి నాణ్యత కలిగి ఉంటాయి.”

### చెడు పనుల నుండి అల్లాహ్ యొక్క రక్షణ:-

అదే కాలానికి చెందిన మరో సంఘటన ఇది. ఒక రాత్రి, తనతో కలిసి మేకలను మేపే సహచరునితో ప్రవక్త (స)గారు ఇలా అన్నారు: “నా మేకలను కొద్దిసేపు నువ్వు చూసుకో. నేను పట్టణానికి వెళ్లి ప్రజలు ఎలా సమావేశమై ఉంటారో చూసి వస్తాను.” ఆ రోజుల్లో అరబ్బులలో రాత్రివేళ ప్రజలు ఒక ఇంటిలో చేరికథలు చెప్పుకోవడం, పద్యాలు చదవడం, పాటలు పాడుకోవడం వంటి వినోదాలలో గడిపేవారు. కొన్నిసార్లు అలాంటి సమావేశాలు రాత్రంతా కొనసాగేవి. బాల్య సహజమైన ఆసక్తితో ప్రవక్త (స)గారు కూడా అలాంటి ఒక సమావేశాన్ని చూడాలని బయలుదేరారు. అయితే భవిష్యత్తులో ఖాతమున్ నబీయ్యీన్ కాబోయే వారిని అలాంటి నిరర్థక సమావేశంలో పాల్గొనడం అల్లాహ్‌కు ఇష్టం కాలేదు. అందువల్ల మార్గమధ్యంలోనే వారి (స)కి గాఢనిద్ర వచ్చింది. అక్కడే నిద్రపోయి ఉదయం వరకు మేలుకోలేదు. మరొకసారి కూడా వారికి అలాంటి సమావేశానికి వెళ్లాలనే ఆలోచన వచ్చింది. కానీ ఆ సందర్భంలో కూడా అల్లాహ్ యొక్క అదృశ్య సహాయం వారిని అటు వెళ్ళకుండా నిలిపివేసింది. ప్రవక్తగా నియమించబడిన తరువాత వారు (స) ఇలా చెప్పేవారు: “నా జీవితంలో కేవలం రెండు సార్లు మాత్రమే అలాంటి సమావేశాలకు వెళ్లాలని నేను సంకల్పించాను. కానీ ఆ రెండు సందర్భాల్లో కూడా నన్ను అల్లాహ్ అడ్డుకున్నాడు.” **(పేజి 114-117)**

## సీరతుల్ మహ్దీ (అలైహిస్సలాతు వస్సలాం):- سیرت المہدی علیہ السلام

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**(18) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) తన యౌవన కాలాన్ని గురించి తరచుగా ఇలా చెప్పేవారు. ఆ సమయంలో తనకు ఈ మార్గంలో ఆధ్యాత్మిక అభివృద్ధి సాధించాలంటే ఉపవాసాలు కూడా అవసరమని తెలిసింది లేదా అల్లాహ్ తరఫున తనకు అలాంటి సూచన లభించింది. ఆ తరువాత హుజూర్ (అ) వరుసగా ఆరు నెలల పాటు ఉపవాసాలు ఉన్నారు. ఇంట్లోవారికైనా, బయటి వారికైనా వారు (అ)ఉపవాసం చేస్తున్న విషయం ఎవరికీ తెలియదు. ఉదయం ఇంటి నుండి భోజనం వచ్చినప్పుడు దానిని ఎవరైన అవసరంలో ఉన్న వ్యక్తికి ఇచ్చేవారు. సాయంత్రం మాత్రం హుజూర్ (అ) భోజనం చేసేవారు. నేను హజ్రత్ వాలిదా సాహిబాను అడిగాను: "జీవితం చివరి దశలో కూడా హుజూర్ (అ) స్వచ్ఛంద (నఫ్లీ) ఉపవాసాలు పాటించారా? లేదా?" అందుకు వాలిదా సాహిబా (తల్లిగారు) ఇలా సమాధానం ఇచ్చారు: "జీవితాంతం వరకు కూడా హుజూర్ (అ) నఫ్లీ ఉపవాసాలు పాటించేవారు. ముఖ్యంగా షవ్వాల్ నెలలోని ఆరు ఉపవాసాలను ఎంతో నియమబద్ధంగా పాటించేవారు. అలాగే, ఏదైనా ప్రత్యేకమైన విషయం గురించి దుఆ చేయవలసి వచ్చినప్పుడు కూడా హుజూర్ (అ) ఉపవాసం ఉండేవారు. అయితే, జీవితంలోని చివరి రెండు మూడు సంవత్సరాల్లో శారీరక బలహీనత మరియు వృద్ధాప్య కారణంగా రమజాన్ ఉపవాసాలను కూడా పూర్తిగా పాటించలేక పోయారు."

(ఈ భవదీయుడు తెలియజేయు విషయమేమనగా, "కితాబ్ అల్-బరియ్యా" లో హజ్రత్ సాహిబ్ ఉపవాసాల కాలాన్ని ఆరు నెలలు కాకుండా ఎనిమిది లేదా తొమ్మిది నెలలుగా పేర్కొన్నారు.)


**(19) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారికి బషీర్ అవ్వల్ (మా పెద్ద అన్నయ్య, ఆయన 1888లో మరణించారు) మరణించిన కొద్ది రోజుల తర్వాత మొదటి సారిగా తల తిరుగుడు మరియు "హిస్టీరియా" అని పిలవబడే లక్షణాలు కల్గిన అనారోగ్య సమస్య ప్రారంభమైనది. ఒక రాత్రి నిద్రలో ఉండగా హుజూర్(అ) ఒక్కసారిగా లేచారు. ఆ తర్వాత వారి (అ) ఆరోగ్యం క్షీణించింది. అయితే ఆ మొదటి అనారోగ్య దాడి స్వల్పంగానే ఉంది. కొంతకాలం తర్వాత ఒక రోజు హుజూర్ (అ) నమాజ్ చేయడానికి బయటకు వెళ్తూ, "ఈ రోజు ఆరోగ్యం కొంచెం బాగోలేదు" అని చెప్పారు. కొద్దిసేపటి తర్వాత షేఖ్ హామిద్ అలీ (హజ్రత్ మసీహ్ మౌవూద్ గారి పాత, విశ్వాసపాత్ర సేవకుడు, పరమపదించారు) ఇంటి తలుపు తట్టి, "త్వరగా ఒక పెద్ద పాత్రలో వేడి నీళ్లు సిద్ధం చేయండి" అని చెప్పారు. వాలిదా సాహిబా ఇలా చెప్పారు: "అప్పుడు హజ్రత్ సాహిబ్ ఆరోగ్యం మరింత క్షీణించింది అని నాకు వెంటనే అర్థమైంది. అందుకే నేను ఒక పని మనిషిని పంపించి, 'మియాన్ సాహిబ్ ఆరోగ్యం ఎలా ఉంది?' అని అడగమన్నాను. షేఖ్ హామిద్ అలీ, 'కొంచెం ఎక్కువగా క్షీణించింది' అని చెప్పారు. నేను పర్దా ధరించి మసీదుకు వెళ్లాను. అక్కడ హుజూర్ (అ) పడుకుని ఉన్నారు. నేను దగ్గరకు వెళ్లగానే హుజూర్ (అ) ఇలా అన్నారు: 'నా ఆరోగ్యం చాలా క్షీణించింది. కానీ ఇప్పుడు కొంత ఉపశమనం ఉంది. నేను నమాజ్ చేయిస్తుండగా, నా ఎదుట ఒక నల్లని వస్తువు పైకి లేచి ఆకాశం వరకు వెళ్తున్నట్లు కనిపించింది. ఆ తర్వాత నేను ఒక్కసారిగా అరుస్తూ నేలపై పడిపోయాను. స్పృహ కోల్పోయిన ఒక స్థితి ఏర్పడింది.' వాలిదా సాహిబా మరల ఇలా తెలిపారు: ఆ సంఘటన తర్వాత హుజూర్ (అ) ఇలాంటి అనారోగ్య సమస్య నిరంతరం కొనసాగుతూ వచ్చింది. నేను అడిగాను: "ఆ అనారోగ్య సమస్య సమయంలో ఏమి జరిగేది?". వాలిదా సాహిబా ఇలా తెలిపారు: "చేతులు, కాళ్లు చల్లబడిపోయేవి. శరీర కండరాలు బిగుసుకుపోయేవి, ముఖ్యంగా మెడ కండరాలు. తల తిరిగేది. ఆ సమయంలో హుజూర్ (అ) తన శరీరాన్ని తానే నిలబెట్టుకోలేక పోయేవారు. మొదట్లో ఈ దాడులు చాలా తీవ్రంగా ఉండేవి. తర్వాత కాలక్రమేణా వాటి తీవ్రత తగ్గింది. అలాగే హుజూర్ (అ) గారి శరీరం కూడా వాటికి కొంత అలవాటు పడింది." నేను అడిగాను: "దీనికి ముందు హుజూర్ (అ)కు తల సంబంధిత ఇబ్బంది ఏదైనా ఉండేదా?" వాలిదా సాహిబా ఇలా సమాధానం ఇచ్చారు: "ఇంతకుముందు అప్పుడప్పుడు సాధారణ తలనొప్పి మాత్రమే వచ్చేది." నేను మళ్లీ అడిగాను: "అప్పటి వరకు హజ్రత్ సాహిబ్ స్వయంగా నమాజ్ చేయించేవారా?" వాలిదా సాహిబా ఇలా చెప్పారు: "అవును. కానీ ఈ దాడులు ప్రారంభమైన తర్వాత హుజూర్ (అ) నమాజ్ చేయించడం మానేశారు."

"ఈ సంఘటన హుజూర్ (అ) మసీహ్‌గా ప్రకటన (దావా) చేయకముందు జరిగినది."

(సంపాదకుని వివరణ: ఈ కథనంలో వాలిదా సాహిబా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సమస్యను గూర్చి "హిస్టీరియా" అనే పదాన్ని ఉపయోగించినప్పటికీ, అది వైద్యశాస్త్రంలో చెప్పే హిస్టీరియా అనే వ్యాధిని సూచించదు. ఆ పదాన్ని కేవలం తల తిరుగుడు, లక్షణాలకు కొంత పోలిక ఉన్నందున సాధారణ అర్థంలో ఉపయోగించారు. రెండవ భాగంలోని 365 మరియు 369 నంబరు కథనాలలో వివరించినట్లుగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి నిజానికి హిస్టీరియా వ్యాధి లేదు. అలాగే, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తమ రచనల్లో ఎక్కడా కూడ తమ ఈ అనారోగ్యాన్ని హిస్టీరియా అని పేర్కొన లేదు. వైద్యపరంగా కూడా తల తిరుగుడు (లేదా దౌరాన్-ఎ-సర్)ను హిస్టీరియా లేదా మరాక్ అని పిలవడం సరైంది కాదు. ఆంగ్లంలో దీనిని సాధారణంగా వర్టిగో అని పిలుస్తారు. ఇది తలనొప్పికి సంబంధించిన ఒక రకమైన సమస్య. ఇందులో: (1) తల తిరుగుతుంది. (2) మెడ మరియు ఇతర కండరాల్లో బిగుతు ఏర్పడుతుంది. (3) నడవడం లేదా నిలబడడం కష్టమవుతుంది. అయితే స్పృహ లేదా మానసిక స్థితిపై ఎలాంటి ప్రభావం ఉండదు. అంతేగాకా ఈ భవదీయుడు స్వయంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ గారిని అనేకసార్లు ఈ సమస్య సమయంలో చూసినాడు. అయితే హుజూర్ (అ) ఎప్పుడూ స్పృహ కోల్పోవడంను చూడలేదు. నిజానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి ఉన్నటు వంటి ఈ అనారోగ్య సమస్యలు కూడా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఒక భవిష్యవాణికి అనుగుణంగా ఉందని భావించబడింది. ఆ భవిష్యవాణిలో మసీహ్ మౌవూద్ "రెండు పసుపు దుప్పట్లలో (అంటే రెండు వ్యాధులతో) కప్పబడి వస్తాడు" అని పేర్కొనబడింది. (మిష్కాత్, బాబ్ ఇష్రాఅతు స్సాఅత్, ముస్లిం మొ॥ కథనాల ఆధారంగా) కథనములో తెల్పబడినట్లుగా మొదటి దాడి సమయంలో హుజూర్ (అ)కు "ఒక నల్లని వస్తువు ఆకాశం వైపు పైకి వెళ్తున్నట్లు కనిపించింది" అనే పదాలు పేర్కొనబడ్డాయి. వర్టిగో సమయంలో తల తిరుగుట వల్ల చుట్టూ ఉన్న వస్తువులు తిరుగుతూ పైకి ఎగురుతున్నట్లుగా కనిపించడం సాధారణ విషయం. అంతేకాక, అలాంటి సమయంలో రోగి కళ్లను మూసుకోవాలనే స్వభావంను కలిగి ఉండడం వల్ల ఆ దృశ్యాలు నల్లగా కనిపించవచ్చు. అలాగే, కథనంలో "స్పృహ కోల్పోయినట్లుగా" అని చెప్పబడినది నిజమైన మూర్ఛ కాదని, తీవ్రమైన బలహీనత వల్ల కళ్లను తెరవలేకపోవడం లేదా మాట్లాడలేకపోవడం మాత్రమే ఉద్దేశమని తెలుస్తుంది. అల్లాహ్‌కే నిజమైన విజ్ఞానం గలదు) ఈ అంశంపై మరింత అవగాహన కోసం 81, 293 మరియు 459 సంఖ్యలకు చెందిన కథనాలను కూడా పరిశీలించ వచ్చును.

**(20) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా (తల్లి గారు) నాకు ఇలా చెప్పారు:** హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మొదటి బైఅత్‌ను లుధియానాలో స్వీకరించారు. మొదటి రోజున నలభై మంది బైఅత్ చేశారు. తరువాత హుజూర్ (అ) ఇంటికి వచ్చినప్పుడు కొంతమంది మహిళలు కూడా బైఅత్ చేశారు. అందరిలో మొదటగా మౌల్వీ నూరుద్దీన్ సాహిబ్ బైఅత్ చేశారు. ఈ భవదీయుడు "మీరు ఎప్పుడు బైఅత్ చేశారు?" అని అడిగాను. అందుకు వాలిదా సాహిబా ఇలా అన్నారు: "ప్రజల్లో నేను బైఅత్ చేయడాన్ని వాయిదా వేసి, చాలా సంవత్సరాల తరువాత బైఅత్ చేశాననే ప్రచారం ఉంది. అది పూర్తిగా అవాస్తవం. నేను ఎప్పుడూ హుజూర్ (అ) నుండి వేరుపడలేదు. ఎల్లప్పుడూ హుజూర్ (అ)తోనే ఉన్నాను. మొదటి నుంచే నన్ను నేను బైఅత్‌లో భాగమైనదానిగానే భావించాను. అందువల్ల నా కోసం ప్రత్యేకంగా అధికారిక బైఅత్ చేయాల్సిన అవసరం ఉందని నేను అనుకోలేదు." ఈ విషయమై ఈ భవదీయుడు తెల్పునదేమనగా, ప్రారంభ బైఅత్ జరిగిన సమయంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇంకా తాను మసీహ్ లేదా మహ్దీ అని ప్రకటించలేదు. ఆ సమయంలో హుజూర్ (అ) ఒక సాధారణ ముజద్దిద్ (పునరుద్ధారకుడు) గారి విధానంలోనే బైఅత్ స్వీకరించారు. తరువాత నేను వాలిదా సాహిబాను అడిగాను: "మౌల్వీ సాహిబ్ కాకుండా మొదటి రోజున ఇంకా ఎవరు బైఅత్ చేశారు?" అందుకు వాలిదా సాహిబా (రజి): మియాం అబ్దుల్లా సాహిబ్ సన్నౌరీ మరియు షేఖ్ హామిద్ అలీ సాహిబ్ గారి పేర్లను తెలిపారు.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 06 AUG 2026, Issue No : 32

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

# సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఆస్ట్రేలియా జాతీయ ఆమిలా (కార్యవర్గం)తో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ వారి సమావేశం:-**

**(గత సంచిక తరువాత)**

హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) ఇలా మార్గనిర్దేశం చేశారు: ఖుర్ఆన్ కరీమ్ విక్రయాలు కూడా ఎక్కువ కావాలి. లండన్ నుండి పంపిన ఖుర్ఆన్ కరీమ్ అక్కడికి చేరిన తర్వాత ధర ఎక్కువగా పడుతున్నట్లయితే, దాని పూర్తి వివరాలను సమీక్షతోసహా నాకు పంపండి. తరువాత దీనిపై తగిన సూచనలు ఇస్తాను. నేను ముందే సూచించినట్లుగా, హజ్రత్ ఖలీఫతుల్ మసీహురా (రహిమహుల్లాహ్) రచించిన **రెవలేషన్ రేషనాలిటి నాలేడ్జ్ & ట్రూత్** అనే పుస్తకాన్ని గోదాములలో నిల్వ ఉంచకుండా పంపిణీ చేయండి. ఎక్కువకాలం నిల్వ ఉండడం వల్ల దాని కాగితం పసుపు రంగులోకి మారుతోంది.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: ఖాదియాన్ నుండి కొత్తగా ప్రచురిత మవుతున్న పుస్తకాలన్నింటినీ వెంటనే తెప్పిస్తూ ఉండండి. అన్వారుల్ ఉలూమ్ యొక్క మరిన్ని సంపుటాలు కూడా ప్రచురించబడ్డాయి. వాటిని కూడా తెప్పించండి.

**పుస్తకాల అనువాదాల గురించి హుజూర్ అన్వర్ ఇలా సూచించారు:** అక్కడే ఒక ప్రత్యేక అనువాద బృందాన్ని ఏర్పాటు చేయండి. ఆ బృందంలోని సభ్యులకు ఇంగ్లీష్ భాషపై ఉన్నత స్థాయి పట్టు ఉండాలి, అలాగే ఉర్దూ కూడా బాగా తెలిసి ఉండాలి. లేదా ఉర్దూ బాగా తెలిసిన ఒక పెద్దవారిని వారితో కలిపి, మిగిలిన వారు కలిసి అనువాదం చేయవచ్చు.

**లీఫ్‌లెట్లు తయారు చేయడం గురించి హుజూర్ అన్వర్ ఇలా సూచించారు:** నేటి ప్రపంచంలో ప్రజలకు మతంపై ఆసక్తి తగ్గిపోయింది. దేవుడిపై నమ్మకం లేని వ్యక్తికి మతం గురించి చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు. కాబట్టి ముందుగా అలాంటి వ్యక్తుల్లో దేవునిపై విశ్వాసాన్ని కలిగించడం అవసరం. చాలామంది మనసుల్లో మతం అనేది కలహాలు, అల్లర్లు, విభేదాలకు కారణమనే భావన ఉంది. అందువల్ల ప్రజల మనస్సులలో నుండి ఈ అపోహలను తొలగించే విధంగా లీఫ్‌లెట్లు సిద్ధం చేయాలి.

**హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు:** పాంప్లెట్‌లు లేదా లీఫ్‌లెట్లు సిద్ధం చేసే ముందు, ముందుగా ప్రణాళిక రూపొందించండి. ప్రజలకు ఏ అంశాలపై ఆసక్తి ఉందో తెలుసుకోవడానికి ఒక సర్వే నిర్వహించండి. ఒక ప్రాంతాన్ని ఎంపిక చేసి, అక్కడ ఎంతమంది నాస్తికులు ఉన్నారు, ఎంతమంది మతాన్ని ఇష్టపడుతున్నారు, ఎంతమందికి క్రైస్తవ మతంపై ఆసక్తి ఉంది, ఎంతమంది ఇస్లాంకు వ్యతిరేకంగా ఉన్నారు, ఎంతమంది ఇస్లాంను ఉగ్రవాదుల మతంగా భావిస్తున్నారు వంటి విషయాలపై పరిశోధన చేయండి. ముందుగా ప్రజల ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకుని, వారి అవసరాలు మరియు మనస్తత్వానికి అనుగుణంగా లీఫ్‌లెట్లు, పాంప్లెట్‌లు తయారు చేసి ప్రచురించండి.

**హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు:** ఖుద్దామ్ మరియు లజ్నా కోసం వేర్వేరు బృందాలను ఏర్పాటు చేయండి. అహ్మదీయ్యాకు వ్యతిరేకంగా ఉన్న వివిధ వెబ్‌సైట్లలో ఈ బృందాలు సరైన ఇస్లామీయ బోధనలను ప్రచారం చేయాలి. ఎవరైనా ఆ వెబ్‌సైట్లను సందర్శించినప్పుడు, అహ్మదీయ్యాకు వ్యతిరేకంగా ఉన్న విషయాలతో పాటు, అహ్మదీయ్యా (అంటే నిజమైన ఇస్లాం) యొక్క సత్యమైన బోధనలు కూడా వారికి కనిపించాలి. అలాగే వ్యతిరేక ప్రచారానికి తగిన సమాధానాలు కూడా అక్కడే లభించాలి.

**ఏదేని ఒక కార్యక్రమం లేదా రిసెప్షన్‌కు జమాత్‌కు చెందని అతిథులను ఆహ్వానించినప్పుడు, జమాఅత్ మహిళలు వారితో కలిసి మెలసినట్లుగా కనిపించరని కొందరు అతిథులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారని అడిగిన ఒక ప్రశ్నకు హుజూర్ అన్వర్ ఇలా సమాధానం ఇచ్చారు:**

మొదటగా, మనం ఆహ్వానించే అతిథులకు మన సంప్రదాయాల గురించి ముందుగానే తెలియ జేయాలి. సాధారణంగా మనకు ముందే పరిచయం ఉన్న వారినే ఆహ్వానిస్తాం కాబట్టి, వారికి ఈ విషయాన్ని ముందుగానే వివరించాలి.

రెండవది, మహిళా అతిథులను తీసుకువచ్చే మహిళల కోసం హాల్ వెనుక భాగంలో ఒక మూలలో ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటు చేయాలి. అక్కడ వారు తమ సంపూర్ణ మర్యాదాపూర్వక వస్త్రధారణలో తమ అతిథులతో కలిసి కూర్చోవచ్చు. అయితే భోజనం చేయడానికి ప్రత్యేకంగా పరదా ఏర్పాటు చేసిన వేరే ప్రదేశం ఉండాలి. వారు అక్కడికి వెళ్లి భోజనం చేయాలి. కార్యక్రమం జరుగుతున్నంత వరకు ఆ ప్రత్యేక మూలలో కూర్చోవడం సరే, కానీ అక్కడ కూర్చొని ఎక్కువసేపు సంభాషణలు చేయడం లేదా అక్కడే భోజనం చేయడం అనుమతించబడదు. భోజనం కోసం పరదాతో కూడిన ప్రత్యేక స్థలం ఉండాలి.

**జాతీయ కార్యదర్శి ఉమూర్-ఏ-ఆమా గారిని హుజూర్ అన్వర్ అడిగారు:** "మీ బాధ్యతలు ఏమిటి?" దీనికి ఆయన సమాధానం ఇచ్చారు: "మూడు ప్రధాన బాధ్యతలు ఉన్నాయి. మొదటిది జమాఅత్ సభ్యుల సంక్షేమం మరియు శ్రేయస్సు." దీనిపై హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: "అదే అసలు మరియు ప్రధాన బాధ్యత." అనంతరం ఆయన, "రెండవది వివాదాలు, తగాదాలను పరిష్కరించడం, మూడవది భద్రతకు సంబంధించిన అంశాలను చూసుకోవడం." అని వివరించారు.

సెక్రటరీ తర్బియత్ ఇలా తెలియజేశారు: ప్రస్తుతం ఉమూర్-ఏ-ఆమా వద్ద ఎనిమిది వివాదాలు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో ఒకటి మతపరమైన విషయం కాగా, మిగిలినవన్నీ భార్యాభర్తల కుటుంబ సంబంధిత సమస్యలని వివరించారు. దీనిపై హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: "తర్బియత్ శాఖ సమర్థ వంతంగా పనిచేస్తే, ఈ సమస్యలన్నీ కూడా సరిదిద్దబడతాయి."

హుజూర్ అన్వర్ మరల ఇలా ఉపదేశించారు: "మనం ఎందుకు అహ్మదీయులం అయ్యామో?, మన బాధ్యతలు ఏమిటో? ప్రతి ఒక్కరికీ స్పష్టంగా అర్థమయ్యేలా చేయడం అవసరం. ఇతరుల ఎదుట మన ప్రవర్తన ఎలా ఉండాలో వారికి తెలియజేయాలి. ఈ సమాజంలో ఉన్న స్వేచ్ఛలో మనం కలిసిపోయి, మన ప్రత్యేకతను కోల్పోయే పరిస్థితి రాకూడదు."

**వక్ఫ్-ఏ-నౌ జాతీయ కార్యదర్శి తన నివేదిక సమర్పిస్తూ ఇలా తెలిపారు:** ప్రస్తుతం వక్ఫ్-ఏ-నౌ సభ్యుల మొత్తం సంఖ్య 442 . వారిలో 277 మంది అబ్బాయిలు, 165 మంది అమ్మాయిలు ఉన్నారు.

15 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు గల వక్ఫ్-ఏ-నౌ సభ్యుల సంఖ్య 174. వారిలో 171 మంది తమ వక్ఫ్ ప్రతిజ్ఞను పునరుద్ధరించారు. దీనిపై హుజూర్ అన్వర్ (అయ్యదహుల్లాహు తఆలా) ఇలా అన్నారు: "తమ వక్ఫ్‌ను పునరుద్ధరించని ఆ ముగ్గురి పేర్లను పంపండి, తద్వారా వారిని వక్ఫ్ బాధ్యత నుండి విముక్తి చేయవచ్చు."

**తాలీమ్ జాతీయ కార్యదర్శికి హుజూర్ అన్వర్ ఇలా సూచించారు:** "ఖుద్దామ్-ఉల్-అహ్మదీయాతో కలిసి అహ్మదీయా స్టూడెంట్స్ అసోసియేషన్‌ను సక్రమంగా ఏర్పాటు చేయండి. ఈ సంఘం విశ్వవిద్యాలయాల్లో ఏర్పడాలి. ఖుద్దామ్-ఉల్-అహ్మదీయాలోని ముహ్తమిమ్ ఉమూర్-ఎ-తులబా ఆధ్వర్యంలో ఈ సంఘాన్ని నిర్వహించవచ్చు."

**హుజూర్ అన్వర్ మరల ఇలా అన్నారు:** "మీ వద్ద ప్రస్తుతం సెకండరీ విద్యను పూర్తిచేస్తున్న 332 మంది విద్యార్థులు ఉన్నారు. వారు తరువాత ఏం చేయాలి?, ఏ విద్యా లేదా వృత్తి మార్గాన్ని ఎంచుకోవాలి? అనే విషయాలపై వారికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేయండి. మీ విద్యార్థులను ఒక వ్యవస్థబద్ధమైన విధానంలో సంఘటితం చేసి, వారు వివిధ రంగాల్లోకి ప్రవేశించేలా మార్గనిర్దేశనం చేయండి. ప్రతి దశలో వారికి సరైన మార్గదర్శకత్వం అందేలా చూడండి."

**హుజూర్ అన్వర్ గారు నేషనల్ సెక్రటరీ జాయిదాద్‌కు ఇలా ఆదేశించారు:** కొన్ని ప్రాంతాలలో వ్యవసాయం చేయడానికి అనుకూలమైన భూమి లభించగలదా, అక్కడ నీటి సౌకర్యం కూడా ఉందా అనే విషయాన్ని పరిశీలించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయండి. (100) వంద ఎకరాల భూమిపై ఒక కుటుంబం వచ్చి స్థిరపడి దానిని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందా అనే అంశాన్ని కూడా పరిశీలించాలి. కొన్ని ప్రాంతాలు వర్షాధార ప్రాంతాలు, కొన్ని నదుల సమీప ప్రాంతాలు ఉన్నాయి. అక్కడ భూములు లభించగలవా?, నీటిని ఉపయోగించడానికి అనుమతి ఉందా ? లేదా? అనే విషయాలను తెలుసుకోవాలి.

సెక్రటరీ జాయిదాద్, సెక్రటరీ పరిశ్రమలు మరియు వాణిజ్యం, అలాగే కొంతమంది సాంకేతిక నిపుణులను కలిపి ఒక కమిటీని ఏర్పాటు చేయండి. ఈ కమిటీ ఈ అన్ని అంశాలను పరిశీలించి, పూర్తి ప్రణాళికను తయారు చేసి పంపాలి.

**(7వ పేజిలో చదవగలరు)**

## 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహ్ విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz